సోమవారం
14-10-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 113
పేజీలు: 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

వియత్నాం, చైనా మధ్య 10 ఒప్పందాలు

హనోయ్: వియత్నాం, చైనా తమ సహకారాన్ని బంధాన్ని మరింత పెంచుకోవాలని సంకల్పించాయి. వ్యవసాయ సహకారం, సరిహద్దు ఆవలి క్యూఆర్ కోడ్ చెల్లింపులతో పాటు మొత్తం పది ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ మేరకు అధికార వర్గాలు ఆదివారం తెలిపాయి. చైనా ప్రధాని లీ కియాంగ్... హనోయ్ పర్యటనను పురస్కరించుకొని ఈ ఒప్పందాలపై సంతకాలు జరిగినట్లు తెలిపాయి. పొరుగు దేశాల మధ్య పటిష్ఠ సహకార-వాణిజ్య బంధం ఉందని, దీనిని మరింత బలోపేతం చేసుకోవాలని రెండు దేశాల అధిపతులు సంకల్పించారని పేర్కొన్నాయి. వియత్నాంకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి దేశంగా చైనా ఉన్నట్లు తెలిపాయి.

బన్నీ సమరం రక్తసిక్తం

విశాలాంధ్ర బ్యూరో కర్నూలు: కర్నూల్ జిల్లాలో నిర్వహించిన బన్నీ సమరం రక్తసిక్తమైంది. 70 మంది గాయపడ్డారు. హోళగుంద మండలం దేవరగట్టులోని మలమాలే స్వరుదునికి వేదమంత్రాల మధ్య కళ్యాణోత్సవం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు. బన్ని కర్రల సమరం సుమారు రెండు గంటల పాటు జరిగింది. ఈ క్రమంలో 70 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని ఆదోని, ఆలూరు వైద్యశాలలకు తరలించారు. ఉత్సవానికిగాను

- మిగతా 2 లో

గౌరీ లంకేశ్ హంతకులకు హిందూత్వవాదుల సన్మానం

బెంగళూరు: హిందూత్వ వాదులు మరోమారు తమ విద్రోహ వైఖరికి అద్దం పట్టారు. హత్యకు గురైన ప్రముఖ జర్నలిస్టులు, హక్కుల కార్యకర్త గౌరీలంకేశ్ హంతకులకు ఘనంగా స్వాగతం పలికారు. కాషాయ కండువాలతో సన్మానించారు. ఈనెల 9న బెంగళూరు సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేయగా ఇద్దరు నిందితులు పరశురాం వాగ్మొరే, మనోహర్ యాదవ్ ఈనెల 11న పరప్పనా అగ్రహార జైలు నుంచి బయటకు వచ్చారు. విజయపురలోని స్వస్థలానికి చేరుకున్న వీరికి స్థానిక హిందూత్వ వాదుల నుంచి ఘన

- మిగతా 2 లో



సీఐడీకి టీడీపీ కార్యాలయంపై దాడి కేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ కేంద్ర కార్యాలయం, చంద్రబాబు నివాసంపై దాడి కేసులను రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ప్రస్తుతం మంగళగిరి, తాడేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కేసులకు సంబంధించి విచారణ కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులను సీఐడీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ దస్త్రాలు సోమవారం సీఐడీకి మంగళగిరి డీఎస్పీ అందజేయనున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఎక్కడికీ పోతావ్, చిన్నవాడా!?

సామాన్యుడు బతికేదెలా?

- తారస్థాయికి ధరలు
- టమాటా, ఉల్లి, ఆకు కూరలూ ప్రియం
- ఏది చూసినా రూ.70 పైనే
- సమీక్షలు, తనిఖీలకే ప్రభుత్వ యంత్రాంగం పరిమితం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు దిగిరావడం లేదు. పండుగలతో అవి మరింత పెరిగి... సామాన్య, మధ్యతరగతి వర్గాలపై ఆర్థిక భారం మోపుతున్నాయి. ధరల అదుపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ... ఎక్కడా తగ్గుముఖం పట్టలేదు. మార్కెట్ ధరలకు పోటీగా రైతు బజార్లలోనూ కూరగాయల ధరలు ఉంటున్నాయి. ఏ కూరగాయ చూసినా కిలో రూ.60 కి పైగా ధర పలుకుతోంది. ఆకు కూరలూ అదే స్థాయిలో ఉన్నాయి. నెలల తరబడిగా ఉల్లి, టమాటా ధరలు అధికంగా ఉన్నాయి. పామాయిల్, పప్పు దినుసుల ధరలూ తగ్గుముఖం పట్టడం లేదు. ఉల్లి కొరతతోనే దాని ధర తగ్గడం లేదని వ్యాపారస్తులు చెబుతున్నారు. అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పౌరసరఫరాల శాఖ ఇంతవరకు చేపట్టలేదు. ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలున్నాయి. స్వయంగా సీఎం చంద్రబాబు రంగంలోకి దిగి అధికారులతో సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేసినా ఫలితం లేదు. ఇటీవల కురిసిన వర్షాలతో పంట చేతికి రాకపోవడంతో ఉల్లి ధరకు రెక్కలొచ్చాయి. ఉల్లి కిలో రూ.70 నుంచి రూ.80 వరకు పెరిగింది. దానికి పోటీగా టమాటా ధర రూ.90 నుంచి రూ.100 వరకు ఉంది. వీటికి తోడు పామాయిల్ ధర లీటరు రూ.240కు చేరింది. పప్పు దినుసుల నుంచి కాఫీ పొడివరకు హద్దూ అదుపూ లేకుండా పెరిగిపోయి వినియోగదారులకు భారంగా మారాయి. కాఫీ పొడి 200 గ్రాములు రూ.280, శనగ పప్పు రూ.120, ఉప్మా రవ్వ, రూ.50, గోధుమ పిండి (కిలో) రూ.45, ఆకు కూరలు (5 కట్టలు) రూ.50 చొప్పున పలుకుతున్నాయి. ఆకుకూర ఒక్కో కట్ట పది రూపాయలకు చేరింది. గతంలో ఇదే ఆకు కూర ధర చూస్తే పది రూపాయలకు 5 కట్టలు రాగా... ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక పచ్చిమిర్చి రూ.70కి చేరి మంట పుట్టిస్తోంది. బీరకాయ, చిక్కుడు కాయ, బీట్‌రూట్, ములగ, దొండకాయ, బెండ, దోసకాయ, కాకర, వంకాయ... ఇలా చెప్పుకుంటూ పోతే ఒకదానికి ఒకటి పోటీపడీ మార్కెట్‌లో కిలో సగటున రూ.70 చొప్పున కొనలేని స్థితిలో ఉన్నాయి. క్యారెట్ ధర రూ.80తో సామాన్యులకు అందనంతగా ఉంది. కొత్తిమేర కట్ట రూ.50గా చేరింది.

ఈ ధరలకు అనుగుణంగా మార్కెట్‌లోకి వారం సరిపడా కూరగాయలు, నిత్యావసరాల కొనుగోలుకుగాను ఒక కుటుంబానికి దాదాపు వెయ్యి నుంచి రూ.2 వేలకు ఖర్చవుతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. నెలలో నాలుగు వారాలకుగాను కూరగాయలు, నిత్యావసరాలకే దాదాపు ఏడెనిమిది వేల రూపాయల ఖర్చవుతోందని ఆందోళన వ్యక్తం చేసుతున్నారు. ఇది పేద, మధ్య తరగతి వర్గాలపై తీవ్ర ఆర్థిక ప్రభావం చూపుతోంది. నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల

- మిగతా 2 లో

ధరల నియంత్రణకు చర్యలు : చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నిత్యావసర వస్తువుల ధరల భారం ప్రజలపై పడకుండా పౌర సరఫరాల శాఖ తీసుకుంటున్న

- మిగతా 2 లో

ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత

నేడు అంతిమ యాత్ర-గాంధీ ఆసుపత్రికి భౌతికకాయం అప్పగింత

న్యూఢిల్లీ/హైదరాబాద్: ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ గోకరకొండ నాగ సాయిబాబా(58) కన్నుమూశారు. అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న అయన రెండు వారాల కిందట శస్త్రచికిత్స చేయించుకోగా కొన్ని సమస్యలు తలెత్తడంతో 20 రోజులుగా నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో చేరారు. చికిత్స పొందుతూ గుండెపోటుకు గురై శనివారం రాత్రి 9 గంటలప్పుడు తుదిశ్వాస విడిచారు. జీఎన్ సాయిబాబా కోరిక మేరకు ఆయన భౌతికకాయాన్ని ఆసుపత్రికి అందజేయనున్నట్లు కుటుంబ సభ్యులు ఆదివారం ప్రకటించారు. సాయిబాబా కళ్లను ఇప్పటికే ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేసినట్లు వెల్లడించారు. సాయిబాబా భౌతిక కాయాన్ని నిమ్స్ నుంచి సోమవారం హైదరాబాద్‌లోని జవహర్ నగర్‌కు తరలిస్తామని చెప్పారు. బంధుమిత్రులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు నివాళులర్పించేందుకు వీలుగా గన్ పార్క్ వద్ద పావు కొద్ది సేపు ఆయన భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచనున్నట్లు వెల్లడించారు. మౌలాలిలోని జవహర్ నగర్ నుంచి సోమవారం ఉదయం 10 గంటలకు అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని, మౌలాలీ కమాన్ వద్ద శ్రీనివాస హైట్స్ వద్ద భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. మధ్యాహ్నం 2గంటలకు అక్కడ నుంచి అంతిమ యాత్రను చేపట్టి 4గంటలకు గాంధీ మెడికల్ కాలేజి వరకు నిర్వహిస్తారు. ఆ తర్వాత భౌతికకాయాన్ని ఆసుపత్రికి అందజేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. మావోయిస్టులతో సంబంధమున్నట్లు కేసులో నిర్దోషిగా కోర్టు విడుదల చేసిన ఏడు నెలల్లో మృత్యు ఒడికి చేరుకున్నారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో 2014లో సాయిబాబాను పోలీసులు అరెస్టు చేశారు. 2017లో గడ్చిరోలి సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించడంతో ఆయన పదేళ్లు జైల్లో ఉన్నారు. ఈ ఏడాది మార్చి 5న బాంబే హైకోర్టు నిర్దోషిగా ప్రకటించడంతో నాగ్‌పూర్ జైలు నుంచి విడుదలయ్యారు. సాయిబాబా 2003 నుంచి 2014 వరకు ఢిల్లీ యూనివర్సిటీ అనుబంధ రామ్ లాల్ ఆనంద్ కాలేజిలో ఆంగ్ల సాహిత్యాన్ని బోధించారు. 2014లో ఆయనను విధుల్లో నుంచి తొలగించారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు రావడంతో మహారాష్ట్ర పోలీసులు సాయిబాబాను అదుపులోకి తీసుకున్నారు.

సాయిబాబాది సంస్థాగత హత్య: స్టాలిన్, ఒవైసీ

సాయిబాబాది సహజ మరణం కాదని సంస్థాగత హత్యని మానవ హక్కుల కార్యకర్తలు, కొందరు రాజకీయ నాయకులు ఆరోపించారు. ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా

- మిగతా 2 లో

సాయిబాబా మేధోశక్తి అంటే కేంద్రానికి హడల్

సీపీఐ

ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కేంద్ర నిరంకుశత్వమే కారణమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. సాయిబాబా పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని కొనియాడారు.

2లో

జోహార్ సాయిబాబా

6లో

అదృష్టమెవరికో!

- 89 వేల దరఖాస్తులు
- సర్కారుకు రూ.1797 కోట్ల ఆదాయం
- నేడు మద్యం లాటరీ... 16 నుంచి నూతన విధానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం దుకాణాలకు భారీగా స్పందన లభించింది. గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రవ్యాప్తంగా 3396 మద్యం షాపుల కోసం మొత్తం 89,882 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 16 నుంచి రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానించగా రికార్డుస్థాయిలో వచ్చాయి. మద్యం టెండర్ల ద్వారా ప్రభుత్వానికి ఏకంగా రూ.1797.64 కోట్ల ఆదాయం లభించింది. దాఖలైన దరఖాస్తుల ప్రకారం ప్రతి దుకాణానికి 25నుంచి 26 దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. అందులో ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగాను, అల్లూరి జిల్లాలో అత్యల్పంగాను దాఖలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో 113 మద్యం దుకాణాలకు 5,800 పెద్దఎత్తున వచ్చాయి. జిల్లా పరిధిలో ప్రతి దుకాణానికి 50నుంచి 51 దరఖాస్తులు దాఖలయ్యాయి. అనంతపురం జిల్లాలో 12 దుకాణాలకు అతి తక్కువగా దరఖాస్తులు వచ్చాయి. తక్కువగా దరఖాస్తులు వచ్చిన జిల్లాల్లో పునఃపరిశీలనకు ఎక్సైజ్‌శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఈనెల 14న మద్యం దుకాణాల కేటాయింపు కోసం ఎక్సైజ్ అధికారులు లాటరీ నిర్వహిస్తారు. అందులో మద్యం షాపులు వచ్చిన వారికి ఈనెల 15న దుకాణాలు అందజేస్తారు. 16 నుంచి నూతన మద్యం విధానం అమలోకి రానుంది.

ప్రధాన నగరాలు, పట్టణాల్లోనూ దరఖాస్తులు పెద్దఎత్తున వచ్చాయి. టెండర్ల దాఖలులో భారీఎత్తున ఏర్పడిన మద్యం సిండికేట్లు, మొదట్లో దరఖాస్తులు పెద్దగా పడకుండా ప్రయత్నించారు. ఆ విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు హెచ్చరికల అనంతరం దరఖాస్తులు పోటెత్తాయి. తిరుపతి జిల్లాల్లో 3920 దరఖాస్తులు, ప్రకాశం 3,466, పల్నాడు 2,639, నంద్యాల 2,221, నెల్లూరు 3,890, కాకినాడ 3,332, కడప 3,257, అనంతపురం 3,265, అనకాపల్లి 3,291 దరఖాస్తులు దాఖలయ్యాయి. విశాఖ 4,139, 1,393, శ్రీకాకుళం 4,671, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ 4,087, కర్నూలు 3,046, వెస్ట్‌గోదావరి 5,628, విజయనగరం 5,241, గుంటూరు 4,448, వెస్ట్‌గోదావరి 4,384, ఏలూరు 5,499, ఎన్టీఆర్ 5,825 అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి.దరఖాస్తులు వచ్చాయి. ఈ విడత విదేశాల నుంచి ఆన్‌లైన్ ద్వారా మద్యం దరఖాస్తులు పెద్దఎత్తున వచ్చాయి. ఈ దిశగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు రావడం ఇదే తొలిసారని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. అన్ని రకాల బ్రాండ్లకు చెందిన చీప్ లిక్కర్‌ను రూ.99కే విక్రయిస్తారు.

విదేశీ మద్యం బాటిళ్లకు అదనపు ప్రివిలేజ్ ఫీజు

మన దేశంలో తయారయ్యే విదేశీ మద్యం (ఐఎంఎఫ్ఎల్) బాటిల్ ఎంఆర్‌పీ ధరపై అదనపు ప్రివిలేజ్ ఫీజు విధిస్తూ ప్రభుత్వం సవరించింది. రాష్ట్ర గవర్నర్ ఆమోదం మేరకు గెజిట్ నోటిఫికేషన్‌ను ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా

- మిగతా 2 లో

భారీ వర్షసూచన

- బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం
- వాతావరణశాఖ వెల్లడి
- ప్రభుత్వం అప్రమత్తం
- కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ల ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. నైరుతి బంగాళా ఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని... అది సోమవారం అల్పపీడనంగా మారే అవకాశముందని ప్రకటించింది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి

- మిగతా 2 లో

పలస్తీనా పిల్లలకు అరుంధతి రాయ్ 'పెన్ ప్రైజ్' విరాళం

లండన్: ప్రముఖ రచయిత్రి, మానవ హక్కుల కార్యకర్త అరుంధతి రాయ్ తనను వరించిన 'పెన్ ప్రింటర్ ప్రైజ్ 2024'ను పలస్తీనా పిల్లల కోసం విరాళంగా అందించారు. సామాజిక న్యాయానికి కట్టుబడిన తన రచనలకు గుర్తింపుగా పెన్ ప్రింటర్ పురస్కారాన్ని అరుంధతి రాయ్ అందుకున్నారు. పురస్కారాన్ని బహూకరించినప్పుడు ఆమె మాట్లాడుతూ పలస్తీనా దీనస్థితి, భారత్‌లోని రాజకీయ ఖైదీల పరిస్థితిని ప్రస్తావించారు. బ్రిటిష్ లైబ్రరీలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో అరుంధతి రాయ్ ప్రసంగించారు. తనకు పురస్కారం రూపేణ లభించిన నగదును పలస్తీనా పిల్లల నిధికి అందజేయనున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో పలస్తీనాకు సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు. వెస్ట్‌బ్యాంక్, గాజాలో ఇజ్రాయిల్ దురాక్రమణ, మారణహోమాన్ని తీవ్రంగా ఖండించారు. దురాక్రమణ,

- మిగతా 2 లో

సిద్ధిఖీ హత్యపై రాజకీయ దుమారం

- శాంతిభద్రతలు క్షీణించాయి : కాంగ్రెస్ విమర్శ
- 'మహా' సర్కారే బాధ్యత వహించాలి : రాహుల్

ముంబై: ఎన్‌సీపీ నాయకుడు, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ శనివారం రాత్రి ముంబైలోని బాంద్రాలోని తన కుమారుడి కార్యాలయం సమీపంలో హత్యకు గురైన తర్వాత అధికార బీజేపీ, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ దుమారం చెలరేగింది. బీజేపీ నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వం ఈ సంఘటనను 'రాజకీయం' చేయవద్దని అభ్యర్థించగా, ప్రతిపక్ష నాయకులు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ ఘటనను రాష్ట్రంలో 'శాంతిభద్రతల పతనం' గా అభివర్ణిస్తూ, అధికార పార్టీపై విమర్శలు గుప్పించింది. సిద్ధిఖీ హత్యపై కాంగ్రెస్ అగ్ర నేత

- మిగతా 2 లో

నలుగురు కామాంధుల అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో- శ్రీసత్య సాయి: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన అత్తా కోడలిపై సామూహిక అత్యాచార ఘటనలో నలుగురు నిందితులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత ఆదేశాల మేరకు ఎస్పీ వి.రత్న ... కేసును సవాల్‌గా తీసుకొని ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి ఘటన జరిగి 24 గంటలు గడవకముందే నిందితులను పట్టుకున్నారు. మొత్తం ఐదుగురు నిందితుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు సమాచారం. మగవారిని మారణాయుధాలతో బెదిరించి మహిళలిద్దరిపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం నల్లబొమ్మినిపల్లి గ్రామంలో వెలుగు చూసింది.

ఇదిలా ఉండగా... నిందితులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ సీపీఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అధ్వర్యంలో ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, వ్యవసాయ కార్మికసంఘాలు హిందూపురం తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేశాయి.

నిందితులను కఠినంగా శిక్షించాలి: సీపీఐ

అత్తాకోడలిపై అత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠిన శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్

డిమాండ్ చేశారు. పొట్టకూటి కోసం వచ్చిన మహిళలపై సామూహిత అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని జగదీష్ కోరారు.

ఇటలీలో పలస్తీనా సంఘీభావ మార్చ్

రోమ్: ఇటలీ రాజధాని రోమ్‌లో పలస్తీనాకు సంఘీభావం తెలుపుతూ భారీ ప్రదర్శన జరిగింది. ఇందులో వేలాది మంది పాల్గొన్నారు. గత వారం జరిగిన మార్చ్ హింసాత్మకమైన విషయం తెలిసిందే. ప్రదర్శనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. దాదాపు 40 మంది అరెస్టు అయ్యారు. ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా స్థానిక యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఇటలీ రాజధాని వీధులు, ప్రధాన కూడళ్లను మార్చ్ నిర్వహించేందుకు అనుమతులు జారీచేసింది. పియాజలే ఓస్టిన్సె నుంచి రెండు మైళ్ల దూరంలోని పియజ్జా విట్టోరియో ఇమ్మానుయేల్ 2 వరకు ప్రదర్శనకారులు కదం తొక్కారు. పలస్తీనాకు మద్దతు ప్రకటించారు. పలస్తీనాకు అనుకూలంగా బ్యానర్లు, ప్లకార్డులు, జెండాలు ప్రదర్శించారు. పలస్తీనాతో పాటు లెబనాన్‌కు సంఘీభావం తెలుపుతూ పతాకాల రంగులను, జెండాలను ప్రదర్శించారు.

లెబనాన్‌పై ఇజ్రాయిల్ ఉధృత పోరు

ఒట్టామన్ కాలం నాటి మార్కెట్, చారిత్రక మసీదు ధ్వంసం

జెరూసలేం/డెయిర్ అల్ బలాహ్: లెబనాన్‌లోని హెజ్బుల్లా లక్ష్యాలపై ఇజ్రాయిల్ భీకరంగా వైమానిక దాడులను జరిపింది. హెజ్బుల్లాకు పట్టుండే ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం విరుచుకుపడింది. చారిత్రక మసీదు, మార్కెట్‌ను ధ్వంసం చేసింది. సరిహద్దు వెంబడి హెజ్బుల్లా సాయుధులతో పోరు సాగించింది. సరిహద్దు గ్రామంలోని వందేళ్ల నాటి మసీదుపై వైమానిక దాడి చేసింది. ఒట్టామన్ కాలం నాటి మార్కెట్‌పై వైమానిక దాడులు జరిపి 12 నిర్వాసిత భవనాలు, 40 దుకాణాలను ధ్వంసం చేసింది. 1910లో నిర్మించిన చరిత్రాత్మక మార్కెట్ నామ రూపాలు లేకుండా చేసింది. గత 24 గంటల్లో దక్షిణ లెబనాన్‌లోని 200 హెజ్బుల్లా లక్ష్యాలను తమ దళాలు ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. 50 మంది హెజ్బుల్లా సభ్యులను మట్టు బెట్టినట్లు వెల్లడించింది. రాకెట్ లాంఛర్లు, యాంటీ-ట్యాంక్ పొజిషన్స్, వెపన్స్ క్యాచెస్‌ను నాశనం చేశామని ఐడీఎఫ్ తెలిపినట్లు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయిల్ నివేదించింది. లెబనాన్‌పై దాడులను ఇజ్రాయిల్ సెప్టెంబరులో మొదలు పెట్టగా 2,255 మంది చనిపోయారు. అటు హెజ్బుల్లా కూడా ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ప్రతీకార దాడులు చేస్తోంది. లెబనాన్ భూభాగంలోని ఇజ్రాయిల్ దళాలపై రాకెట్లు ప్రయోగించింది. మరౌమ్ అల్ రస్ గ్రామంలోని ఇజ్రాయిల్ దళాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణులతో దాడి చేసింది. సరిహద్దు వెంబడి చొరబాటుకు యత్నించిన దళాలను కట్టడి చేసినట్లు హెజ్బుల్లా ప్రకటించింది.

గాజాలో ఒకటే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది మృతి

సెంట్రల్ గాజాలో ఇజ్రాయిల్ దాడులు భీకరంగా సాగుతున్నాయి. తాజాగా నుసీరత్ శిబిరం పరిధి ఇంటిపై వైమానిక దాడి జరిపింది. ఈ దాడిలో తల్లిదండ్రులు సహా ఆరుగురు పిల్లలు పోయారు. ఎనిమిది మంది మృత్యువాత పడగా, పిల్లల్లో 8 నుంచి 23 ఏళ్ల లోపు వారు ఉన్నారు. ఈ దాడిలో గాయపడిన మరో ఏడుగురిలో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు పలస్తీనా వైద్యాధికారులు వెల్లడించారు.

లెబనాన్‌లో కాల్పుల విరమణ: మాక్రాన్ పిలుపు

పారిస్: లెబనాన్‌లో తక్షణమే కాల్పులు విరమించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ పిలుపునిచ్చారు. లెబనాన్ పార్లమెంటు స్పీకర్ నబీ బెర్‌తో జరిపిన ఫోన్ సంభాషణలో కాల్పుల విరమణ గురించి మాక్రాన్ మాట్లాడినట్లు 'ఎలీసీ' (అధ్యక్ష భవనం) వర్గాలు తెలిపాయి. ఇజ్రాయిల్ దాడుల విస్తరణ, లెబనాన్‌లో ప్రాణ నష్టంపై మాక్రాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నాయి. దేశ ఐక్యత, సుస్థిరత కోసం ఏకం కావాలని లెబనాన్ ప్రజలకు మాక్రాన్ పిలుపునిచ్చారు. ఈ కొత్త సవాలును కలిసి ఎదుర్కొవాలని అన్ని పార్టీలను కోరారు. సమగ్ర రాజకీయ కార్యక్రమానికి మద్దతివ్వడం ద్వారా జాతీయ ఐక్యతకు హామీనిచ్చే అధ్యక్షుడిని ఎన్నుకోవాలని సూచించారు. ఈనెల 24న పారిస్‌లో జరగబోయే అంతర్జాతీయ సదస్సు వేదికగా లెబనాన్ సార్వభౌమత్వం, లెబనాన్ ప్రజలకు మద్దతుగా అంతర్జాతీయ సమాజాన్ని చైతన్యపరుస్తామన్నారు. లెబనాన్‌కు మద్దతు కూడకట్టేందుకు తన వంతు కృషి చేస్తానని నబీ బెర్‌కు మాక్రాన్ హామీనిచ్చాయి. యునైటెడ్ నేషన్స్ ఇంటెరిమ్ ఫోర్స్ ఇన్ లెబనాన్ (యూఎన్ఐఎఫ్ఐఎల్)కు ఫ్రాన్స్ కట్టుబడి ఉందని నొక్కిచెప్పారు. ఐరాస శాంతి కార్యకర్తలపై దాడులను ఖండించారు. ఈ మేరకు ఎలీసీ వర్గాలు వెల్లడించాయి.

అక్టోబరు 7 దాడులతో సంబంధం లేదు: ఇరాన్

గోలన్ హైట్స్ ఇజ్రాయిల్ స్థావరంపై ఇరాక్ డ్రోన్ దాడి

టెహ్రాన్/డమాస్కస్: గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమాస్ జరిపిన మెరుపుదాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. తమ దేశాన్ని ఆ దాడితో ముడిపెట్టడాన్ని ఖండించింది. ఆ మేరకు వచ్చిన వార్తలను కొట్టిపారేసింది. న్యూయార్క్‌లో ఐరాసకు ఇరాన్ శాశ్వత ప్రతినిధి దీనిపై స్పందించారు. ఇజ్రాయిల్‌పై మెరుపు దాడితో ఇరాన్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇదిలావుంటే, ఇదే అంశంపై ది న్యూయార్క్ టైమ్స్, ది వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రశ్నలకు ఇరాన్ మిషన్ సమాధానాలు ఇచ్చింది. తమను నాటి దాడితో ముడిపెట్టడాన్ని ఖండించింది. ఈ మేరకు ఐఆర్ఎన్ఏ వార్తాసంస్థ పేర్కొంది. ఖతార్ రాజధాని దోహాలోని హమాస్ అధికారులు ఒక ప్రకటన చేశారు. అందులో ఈ దాడి గురించి తమకు తెలియదని చెప్పారు. గాజాలోని హమాస్ సైనిక విభాగానిదే అందుకు పూర్తి బాధ్యతగా తెలిపారు. ఇరాన్‌కు లేక హెజ్బుల్లాకు భాగస్వామ్యం ఉన్నట్లు తప్పుడు ప్రచారం జరుగుతోందని అధికారులు పేర్కొన్నట్లు ఐఆర్ఎన్ఏ తెలిపిందని జిన్హువా నివేదించింది. ఇదిలావుంటే, ఇరాక్‌కు చెందిని ఇస్లామిక్ రెసిస్టెన్స్ ఆదివారం గోలన్ హైట్స్‌లోని ఇజ్రాయిల్ సైనిక స్థావరం లక్ష్యంగా డ్రోన్ దాడి చేసింది. మానవరహిత వైమానిక వాహనాల ద్వారా ఈ దాడి జరిగింది. ఇరాన్ -ఇరాకీ మిలిషియా ఇజ్రాయిల్‌ను ప్రతిఘటిస్తున్నాయి. గాజా, లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని చెబుతున్న క్రమంలో యూద దేశంపై మధ్యమధ్యలో దాడులు చేస్తున్నాయి.

సామాన్యుడు బతికేదెలా?

(మొదటిపేజీ తరువాయి)

వేతనాలతో అద్దె ఇళ్లల్లో జీవిస్తున్న ప్రైవేట్ ఉద్యోగులు... ఈ కూరగాయలను కొనుగోలు చేయడం భారంగా మారింది. ఈ ధరల పెరుగుదలతో రోజువారీ కూలీలు, సామాన్యులు రైతు బజార్లకు వెళ్లి అరకొరగానే కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు.

బ్లాక్ మార్కెటింగ్‌తోనే ప్రజలపై భారం

ఉల్లి, టమాటా తదితర డిమాండ్ సరుకులు బ్లాక్ మార్కెట్‌కు తరలడంతోనే ఈ కొరత ఏర్పడుతోంది. మార్కెట్‌తో పాటు రైతు బజార్లలోనూ సామాన్యులకు అందుబాటులోకి రావడం లేదు. ఉల్లి, టమాటా దిగుబడి సరిగ్గా లేకపోవడంతో ధరలు పెరిగినట్లు వ్యాపారస్తులు చెబుతున్నప్పటికీ... మిగిలిన కూరగాయలు, నిత్యావసరాల ధరలు విపరీతంగా ఎందుకు పెరుగుతున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉల్లి, టమాటాను బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలతో పాటు ప్రభుత్వం సకాలంలో సరైన చర్యలు చేపట్టకపోవటం వల్ల నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగి సామాన్య ప్రజల జీవన విధానంపై భారీ ప్రభావం చూపుతోంది. గత ఏడాదితో పోలిస్తే... ప్రస్తుతం నిత్యావసరాలు, కూరగాయల ధరలు 40 శాతం వరకు పెరిగినట్లు అంచనా. కందిపప్పు ధర భారీగా పెరిగిపోయింది. వంటనూనెల ధరలు 30 నుంచి 40 శాతం వరకు ఎగబాకాయి. పేద ప్రజల ఆదాయం మొత్తం నిత్యావసరాలు, ఆహార ధాన్యాలకే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గత ఎన్నికల ముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధరలు అదుపు చేస్తామని, ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తామని ఇచ్చిన హామీకి విరుద్ధంగా బడ్జెట్‌లో ఆహార భద్రతకు భారీగా నిధులు తగ్గించింది. బహిరంగ మార్కెట్‌లో ప్రైవేటు వ్యక్తులకు స్వేచ్ఛతో కృత్రిమ కొరతను సృష్టించి... భారీగా ధరల పెంపునకు పరోక్షంగా కేంద్రమే కారణమైందన్న విమర్శలున్నాయి.

అరకొరే సరఫరా

పెరుగుతున్న ధరలతో ప్రజలకు సన్ ఫ్లవర్, పామాయిల్ రేషన్ దుకాణాల్లో తక్కువ ధరతో సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అవి కూడా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఒక్కో రేషన్ కార్డుపై 3 లీటర్ల పామాయిల్, లీటర్ సన్ ఫ్లవర్ ఆయిల్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పామాయిల్ లీటర్ (850 గ్రాములు) ధర రూ.110, సన్ ఫ్లవర్ లీటర్ (910 గ్రాములు) రూ.124 రేషన్ కార్డు ఆధారంగా పంపిణీ చేస్తామని ప్రకటించింది. గతంలో ఇదే తరహాగా రైతుబ బజార్ల ద్వారా కంది పప్పు సరఫరా చేస్తామని ప్రకటించినప్పటికీ... అరకొరగానే స్టాళ్లల్లో ఉంచారు. ఇటీవల సీఎం చంద్రబాబుతో జరిగిన సమీక్షలో పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్, కందిపప్పు, టమాటా, ఉల్లిపాయలు రైతు బజార్లలో కౌంటర్లు ఏర్పాటు చేసి మార్కెట్ ధర కంటే రూ.10 నుంచి రూ.15 తక్కువకు అమ్మకాలు చేస్తున్నట్లు అధికారులు వివరించగా... అవి ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. బ్లాక్ మార్కెటింగ్ వ్యవస్థపై పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించలేదు.

ప్రభుత్వం ఉచిత బియ్యంతో పాటు పప్పు, నూనె, పంచదార పంపిణీ చేయడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని, పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల భారాన్ని అరికట్టడానికి పభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టాలని, వాటితో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 16 రకాల సరకులను ప్రజలకు అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

మరణం మానవ హక్కుల పరిరక్షణ ఉద్యమానికి తీరని లోటని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. అణగారిన వర్గాలపై జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా గళం వినిపించారని, తన స్వేచ్ఛకు, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లినా అవిశ్రాంతంగా పోరాడారని కొనియాడారు. పౌర హక్కులను కాపాడే క్రమంలో సవాళ్లు ఎదురైనా సాయిబాబా చూపిన ధైర్యసాహసాలు చిరస్థాయిగా నిలుస్తాయని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులకు స్టాలిన్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సాయిబాబా మరణానికి ప్రభుత్వమే కారణమని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా వ్యక్తులను దీర్ఘకాలం జైలులో ఉంచేందుకు అనుమతిచ్చే ఉపా చట్టమే ఆయన మరణానికి పాక్షిక కారణమని పేర్కొన్నారు. బాలీవుడ్ నటి స్వరా భాస్కర్ కూడా సాయిబాబా మరణానికి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిన్న ఫాదర్ స్టాన్ స్వామి... నేడు ప్రొఫెసర్ సాయిబాబా మరణాలను సంస్థాగతమైనవిగా పేర్కొంటూ కేంద్రప్రభుత్వం ఈ నేరానికి పాల్పడినా ఎలాంటి శిక్ష లేకుండా తప్పించుకుంటోందని విమర్శించారు. కేరళ ఆర్థిక శాఖ మాజీ మంత్రి థామస్ ఐజక్ స్పందిస్తూ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా చేతులు ప్రొఫెసర్ సాయిబాబా రక్తంతో తడిచాయని వ్యాఖ్యానించారు. మీరు ఎవరికి బుద్ధి చెప్పాలనుకుంటున్నారు? ఒకరిని అణచివేస్తే వంద మంది పుట్టుకొస్తారు అని కేంద్రాన్ని థామస్ హెచ్చరించారు. సాయిబాబా మరణాన్ని హత్యగా ఎంపీ సాకేత్ గోఖలే వర్ణించారు. తప్పుడు కేసు బనాయించి ఆయన హత్యకు కేంద్రం కుట్ర చేసిందని విమర్శించారు. 'పదేళ్లకుపైగా వ్యక్తిగత స్వేచ్ఛను హరించారు. నిర్దోషిగా ప్రకటించకుండా అడ్డుకున్నారు' అని తీవ్రంగా గోఖలే దుయ్యబట్టారు.

సాయిబాబా మేధోశక్తి అంటే కేంద్రానికి హడల్

న్యూఢిల్లీ: ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కేంద్ర నిరంకుశత్వమే కారణమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. సాయిబాబా పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని కొనియాడారు. ఆయన ఆలోచన, మేథోశక్తి అంటే కేంద్రానికి హడల్ అని వ్యాఖ్యానించారు. ఆయన ప్రశ్నించే గుణం ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టించిందని విమర్శించారు. సాయిబాబా శరీరాన్ని చూసి కాదు ఆయన మేథోశక్తి, ఆలోచనా విధానం, ప్రశ్నించే గుణమంటే కేంద్రానికి భయం పట్టుకుంది కాబట్టే అక్రమంగా నిర్బంధించి వేధించిందని రాజా ఒక ప్రకటన చేశారు. సాయిబాబా మరణానికి సంతాపాన్ని, ఆయన కుటుంబానికి, బంధుమిత్రులకు సానుభూతిని ప్రకటించారు. ప్రొఫెసర్ సాయిబాబాతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. సాయిబాబా చాలా సార్లు సీపీఐ కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. సాయిబాబా ఆలోచనలు, సిద్ధాంతాల గురించి తమకు అవగాహన ఉన్నట్లు రాజా చెప్పారు. 'సాయిబాబా సిద్ధాంతాలు, రాజకీయాలతో ఏకీభవించనప్పటికీ ఆయనకు జరిగిన అన్యాయాన్ని, అణచివేత ధోరణిని ఖండిస్తాం' అని అన్నారు. హక్కుల హరణను ఆక్షేపించారు. జైల్లో ఉన్నప్పుడు తల్లి కడచూపుకూ అనుమతి ఇవ్వని నిరంకుశత్వాన్ని దుయ్యబట్టారు. తమను ప్రశ్నించే వారంటే కేంద్రానికి భయమని వ్యాఖ్యానించారు. ఇటువంటి నిరంకుశ ప్రభుత్వాన్ని ప్రతిఘటించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం కావాలని రాజా పిలుపునిచ్చారు.

సాయిబాబా పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం: నారాయణ

ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ సంతాపం ప్రకటించారు. సాయిబాబా భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన పోరాట స్ఫూర్తి ఆదర్శ ప్రాయంగా ఉంటుందన్నారు. అంగవైకల్యం ఉన్నప్పటికీ ఎప్పుడూ మనోధైర్యాన్ని కోల్పోలేదని, ప్రభుత్వ ఆంక్షలను దీటుగా ఎదర్కొని విజేతగా నిలిచారని సాయిబాబాను నారాయణ శ్లాఘించారు. సాయిబాబాను కేంద్రమే హతమార్చిందని వ్యాఖ్యానించారు. '90శాతం అంగవైకల్యంతో బాధపడే సాయిబాబాను ముప్పతిప్పలు పెట్టారు. తీవ్రంగా వేధించారు. పదేళ్ల పాటు ఖైదులో ఉంచారు. సాయిబాబా రాజకీయాలతో నేను, నా పార్టీ ఏకీభవించకపోయినా మానవహక్కుల ఉల్లంఘనను తీవ్రస్థాయిలో ఖండిస్తాం. ప్రభుత్వ నిరంకుశత్వానికి ఓ మేధావి ఈ లోకానికి దూరమయ్యాడు. ప్రభుత్వమే ఆయనను చంపేసింది' అని నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అదే సమయంలో సాయిబాబాకు జరిగిన అన్యాయానికి నిరసనగా హైదరాబాద్‌లో 'అలయ్-బలయ్' కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. అందుకోసం వచ్చిన ఆహ్వానాన్ని నారాయణ తిరస్కరించారు.

కేంద్రానిదే బాధ్యత: సీపీఎం

ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి బాధ్యత కేంద్రానిదే అని సీపీఎం వ్యాఖ్యానించింది. ఏళ్ల తరబడి బెయిల్ ఇవ్వకుండా జైల్లో ఉంచారని, అంగవైకల్యంతో బాధపడే ఆయనకు కనీసం వైద్య సహకారం అందించలేదని దుయ్యబట్టింది. న్యాయం కోసం పోరాటానికి తన జీవితాన్ని సాయిబాబా అంకితం చేశారని శ్లాఘించింది.

వేధింపులను ధైర్యంగా ఎదర్కొన్నారని పేర్కొంది. న్యాయం కోసం పోరాడిన వీరుడికి సెల్యూట్ అంటూ సీపీఎం ప్రకటన పేర్కొంది. సాయిబాబా భార్య వసంత, కుమార్తె మంజీరాకు ప్రగాఢ సానుభూతి తెలిపింది.

సిద్ధిఖీ హత్యపై రాజకీయ దుమారం

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిద్ధిఖీ కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈ హత్య మహారాష్ట్రలో శాంతిభద్రతల క్షీణతకు నిదర్శనమని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'బాబా సిద్ధిఖీ విషాద మరణం దిగ్భ్రాంతికరమైనది, బాధాకరమైనది. ఈ క్లిష్ట సమయంలో నా ఆలోచనలు అతని కుటుంబంతో ఉన్నాయి. ఈ భయానక సంఘటన మహారాష్ట్రలో శాంతి భద్రతలు పూర్తిగా పతనమైన విషయాన్ని బహిర్గతం చేసింది. ప్రభుత్వం బాధ్యత వహించాలి, న్యాయం గెలవాలి' అని 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సిద్ధిఖీ హత్య 'మాటల్లో చెప్పలేనంత దిగ్భ్రాంతికరం' అని అన్నారు. 'ఈ దుఃఖ సమయంలో, నేను అతని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, మద్దతుదారులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. న్యాయం జరిగేలా చూడాలి. ప్రస్తుత మహారాష్ట్ర ప్రభుత్వం క్షుణ్ణంగా, పారదర్శకంగా విచారణ జరిపి దోషులను త్వరగా శిక్షించాలి' అని 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ 'మహారాష్ట్ర సీనియర్ నాయకుడు బాబా సిద్ధిఖీ హత్య వార్త చాలా బాధాకరం. ఆయన కుటుంబానికి ఓర్పు, ధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఎన్‌డీఏ హయాంలో మహారాష్ట్రలో నిరంతరం జరుగుతున్న ఇలాంటి నేర సంఘటనలకు మీరు ఏమి పేరు పెడతారు? అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు. బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మాట్లాడుతూ శివసేన (ఏక్‌నాథ్ షిండే వర్గం), బీజేపీ, ఎన్‌సీపీ (అజిత్ పవార్ వర్గం) తో కూడిన అధికార మహాయుతి కూటమి దోషులను అణిచివేసేందుకు సమయం వృధా చేయలేదని తెలిపారు. 'ఏక్‌నాథ్ షిండే, దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్‌కు చెందిన మహారాష్ట్ర ప్రభుత్వం 24 గంటల్లోనే ఇద్దరు నిందితులను పట్టుకున్నాయి. మూడవ నిందితుడి కోసం అన్వేషణ కొనసాగుతోంది. అతనిని కూడా త్వరలో పట్టుకుంటారు' అని భండారీ చెప్పారు. దీనిపై రాజకీయాలు చేయకూడదని... బాబా సిద్ధిఖీ పెద్ద నాయకుడని... మహారాష్ట్రలో చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, సీఎం ఏక్‌నాథ్ షిండే స్వయంగా దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు. బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ రాహుల్ గాంధీపై విరుచుకుపడుతూ రాష్ట్రం వేగంగా స్పందించడాన్ని అభినందించారు. 'సిద్ధిఖీ హత్య ఘటనపై మనమందరం విచారిస్తున్నాం. కానీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్య ప్రారంభించింది. రాహుల్ గాంధీ, మరికొందరు ఇలాంటి ఘటనల్లో కూడా రాజకీయాల కోసం చూస్తున్నందుకు బాధగా ఉంది' అని ఖండేల్వాల్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కూడా హత్యను రాజకీయం చేయవద్దని ప్రతిపక్షాలను కోరారు. 'మా స్నేహితుడు కోల్పోయినందుకు మాకు చాలా బాధగా ఉంది. ప్రతిపక్షాలు ఈ విషయాన్ని రాజకీయం చేయకూడదు' అని అన్నారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు పంపినట్లు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే : కాంగ్రెస్ నేత అతుల్ పాటిల్

రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, చిన్న పిల్లల నుంచి బడా రాజకీయ నాయకుల వరకు ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర సీనియర్ నేత అతుల్ లోధీ పాటిల్ విమర్శించారు. మహారాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే బాబా సిద్ధిఖీ హత్య జరిగిందని ఆయన ఆరోపించారు. బాబా సిద్ధిఖీ హత్య దురదృష్టకరమని, రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయనడానికి ఇది నిదర్శనమని అతుల్ పాటిల్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కల్పించలేని ఈ ప్రభుత్వానికి ఇంకా అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని అతుల్ లోధీ పాటిల్ మండిపడ్డారు.

దేశం మొత్తం భయపడుతోంది : కేజ్రీవాల్

న్యూఢిల్లీ : బాంద్రా మాజీ ఎమ్మెల్యే, ఎన్‌సీపీ నాయకుడు బాబా సిద్ధిఖీ హత్యపై 'ఎక్స్' వేదికగా ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి , ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఈ హత్యతో మహారాష్ట్ర మాత్రమే కాదు దేశం మొత్తం భయపడుతోందన్నారు. ఢిల్లీలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని, గ్యాంగ్‌స్టర్ పాలన తీసుకురావాలనుకునేవారికి వ్యతిరేకంగా ప్రజలు నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

ధరల నియంత్రణకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

చర్యలపై సీఎం సమీక్షించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ జోక్యం ద్వారా సాధ్యమైనంత వరకు ప్రజలపై నిత్యావసరాల భారం పడకుండా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. ధరలు పెరిగిన తరువాత తగ్గించే ప్రయత్నం చేయడం, సబ్సిడీలో అందించడం కంటే... మూడు శాఖలు నిరంతర పర్యవేక్షణ ద్వారా ధరల పెరుగుదలను ముందుగానే గ్రహించి అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో సివిల్ సప్లయిస్, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఫలితాలు వస్తాయని సూచించారు. ప్రస్తుతం రైతు బజార్లలో కౌంటర్ల ద్వారా చేపట్టిన అమ్మకాలపైన సీఎం ఆరా తీశారు. పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్, కందిపప్పు, టమాటా, ఉల్లిపాయలు రైతు బజార్లలో కౌంటర్లు ఏర్పాటు చేసి మార్కెట్ ధర కంటే రూ.10 నుంచి రూ.15 తక్కువకు అమ్మకాలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. విజిలెన్స్ విభాగం క్రియాశీలకంగా పనిచేయాలని, వ్యాపారులు కూడా సహకరించేలా చూడాలని సీఎం సూచించారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

పామాయిల్, కూరగాయలు, పప్పుల వంటి ఉత్పత్తులు పెంచేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. పెద్ద ఎత్తున గిడ్డంగులను అందుబాటులోకి తేవడం ద్వారా రైతులకు, వినియోగదారులకు కూడా న్యాయం చేయవచ్చని సీఎం దిశానిర్దేశం చేశారు. ధరల నియంత్రణ విషయంలో ప్రజలకు ఉపశమనం కల్పించేలా చర్యలు ఉంటేనే వారు హర్షిస్తారని, ఆ స్థాయిలో అధికారులు ప్రణాళికలను అమలు చేయాలని సీఎం సూచించారు.

అదృష్టమెవరికో!

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేశారు. అదనపు ప్రివిలేజ్ ఫీజు కింద ఎమ్మార్పీ ధరలో చిల్లర కాకుండా, రూ.10కి పెంచుతూ ప్రభుత్వం సవరణ చేసింది. బాటిల్ ఎమ్మార్పీ ధర 150.50గా ఉంటే దాన్ని రూ.160కి ప్రివిలేజ్ ఫీజు అదనంగా పెంచింది.

క్వార్టర్ బాటిల్ ధర 90.50గా ఉంటే ఏపీఎఫ్ కలిపి దాని ధర రూ.100 అవుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్వార్టర్ బాటిల్ ధర 99కే నిర్ధారించినందున రూ.100 ధరకు మినహాయించి విక్రయిస్తారు.

సీఐడీకి టీడీపీ కార్యాలయంపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

2021 అక్టోబరు 19న ఆ పార్టీ సానుభూతి పరులు టీడీపీ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. అనంతరం చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సంఘటనలపై దర్యాప్తునకు ఆదేశించింది. వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి, తలశిల రఘురామ్‌తో పాటు 14 మంది నిందితులుగా ఉన్నారు. వారంతా న్యాయస్థానాలను ఆశ్రయించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసుకు సంబంధించి బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ కేసుల్లో మరికొందరు వైసీపీ నేతలను విచారించనున్నారు. సివిల్ పోలీసుల ద్వారా విచారణ ఆలస్యం అవుతుందనే భావనతో విచారణను వేగవంతం చేసేందుకు సీఐడీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో నిందితుడుగా ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ ముందస్తు బెయిల్ పిటిషన్లపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఆ విచారణకు సహకరించాలని జోగి రమేశ్‌కు న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వుల ఇచ్చే వరకు ఎలాంటి చర్యలు వద్దని సుప్రీం స్పష్టం చేసింది. ఇప్పటికే వివిధ కేసుల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు అరెస్టులయ్యారు. మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్... అగ్రిగోల్డ్ భూముల విక్రయాల అక్రమాల ఆరోపణలపై జైలుకు వెళ్లాడు. ఎన్నికల సమయంలో ఈవీఎం ధ్వంసం కేసులో మరో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైలు జీవితం గడిపి ఇటీవల విడుదలయ్యారు. తమపై కేసులు వస్తాయన్న ఆందోళనతో కొందరు నేతలు పార్టీకి రాజీనామాలు చేసి కూటమి పార్టీల్లోకి వెళ్లారు. టీడీపీ కార్యాలయం, చంద్రబాబు నివాసంపై దాడి కేసులను సీఐడీకి అప్పగించడంతో వైసీపీ నేతలు, పార్టీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది.

గౌరీ లంకేశ్ హంతకులకు హిందూత్వవాదుల సన్మానం

(మొదటిపేజీ తరువాయి)

సన్మానం లభించింది. పూలమాలలు, కాషాయ కండువాలతో ఈ ఇద్దరిని హిందూత్వ సంఘాల పెద్దలు తస్కరించారు. నినాదాల నడుమ ఛత్రపతి శివాజీ విగ్రహం వద్దకు తీసుకెళ్లి మాలలు వేశారు. ఆపై కాళిక ఆలయంలో పూజలు చేశారు. ఈ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన వారిలో అమోల్ కాలే, రాజేశ్ డి. బంగెరా, వసుదేశ్ సూర్యవంశీ, రిషికేశ్ దేవదేకర్, గణేశ్ మిస్కిన్, అమిత్ రామచంద్ర బద్దీ కూడా ఉన్నారు.

బన్నీ సమరం రక్తసిక్తం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అధ్వర్యంలో 800 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. కర్రల సమరం ఆపాలని అధికారులు కొంతకాలంగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. సమరాన్ని ఆపలేకపోయాం కానీ కర్తలను, గాయపడే వారి సంఖ్యను తగ్గించగలిగామని ఎస్పీ బిందు అన్నారు.

పలస్తీనా పిల్లలకు అరుంధతి రాయ్ 'పెన్ ప్రైజ్' విరాళం

(మొదటిపేజీ తరువాయి)

పలస్తీనా ప్రజల అణచివేతే ఇజ్రాయిల్ లక్ష్యమన్నారు. అమెరికా విదేశాంగ విధానాన్ని విమర్శించారు. ఇజ్రాయిల్ దురాగతాలను ఏ వివరణ సమర్థించలేదని అన్నారు. ఇజ్రాయిల్ పోరాడుతున్నది ఆత్మ రక్షణ కోసం కాదు అణచివేత కోసమని వ్యాఖ్యానించారు. 'మరిన్ని భూభాగాలను ఆక్రమించుకొని తమ స్థాయిని పెంచుకోవాలని, మరింత బలోపేతం కావాలని కోరుకుంటోంది. పలస్తీనా ప్రజలను, ఆ ప్రాంతాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తోంది. పలస్తీనాకు అయిన గాయాన్ని ఈ భూమ్మీద ఉన్న ఎంటటి శక్తి కానీ, ఆయుధాలుగానీ, ప్రచారంగానీ కప్పిపుచ్చలేవు. ఈ గాయం ద్వారా ఇజ్రాయిల్ సహా యావత్ ప్రపంచం రక్తమోడుతోంది' అని అరుంధతి రాయ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత పోరు ప్రాదేశిక యుద్ధానికి దారితీస్తుందని ఆమె హెచ్చరించారు. కాగా, 2011లో ఐరోపా విప్లవంలో కీలక పాత్ర పోషించిన అబ్ద్ ఎల్ ఫత్తాతో ఈ పురస్కారాన్ని అరుంధతి రాయ్ పంచుకున్నారు. నోబెల్ గ్రహీత హెరాల్డ్ ప్రింటర్ పేరుతో పెన్ ప్రింటర్ అవార్డులను ప్రదానం చేస్తారు.

భారీ వర్షసూచన

(మొదటిపేజీ తరువాయి)

భారీ వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా రాష్ట్రానికి దక్షిణ కోస్తా తీరం వైపు పయనించే అవకాశాలున్నాయి. ఐఎండీ సమాచారం ఆధారంగా రెండు రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈ నెల 14 నుంచి 17 వరకు భారీ నుంచి కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు, మిగిలిన చోట్ల భారీ వర్షాలు పడనున్నాయి. ఈ సమాచారంతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అటు ప్రభావిత జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలకు నిమగ్నమయ్యారు.

అప్రమత్తంగా ఉండాలి: మంత్రి అనిత

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో పోలీస్ వ్యవస్థ, విపత్తు నిర్వహణ శాఖ అధికారులు 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని హోం, విపత్తుల శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. రాష్ట్రానికి భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ల ఏర్పాటు చేసి అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని అనిత సూచించారు. దక్షిణకోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లా ప్రాంతాలలో వర్షాలు కురవనున్న నేపథ్యంలో గండ్లు పడే కాలువలు, గట్లను గుర్తించి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏలూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి, పల్నాడు, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు కూడా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పిడుగులు పడి, వాగులు పొంగే అవకాశమున్న ప్రాంతాల్లో రైతులు, గొర్రెలకాపరులు, మత్స్యకారులు బయటకు వెళ్లకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, ఎస్డీఆర్ఎఫ్ శాఖలన్నీ సమన్వయంతో ఎప్పటికప్పుడూ ప్రాణ, ఆస్తి నష్టాలు కలగకుండా నియంత్రించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు పడనున్నాయని, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్లు ఏర్పాటు చేశామని విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తెలిపారు. ఈనెల 17 వరకు కోస్తా, రాయలసీమలో భారీవర్షాలు, తీరం వెంబడి 40 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వివరించారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ఆయన సిసోడియా సూచించారు.

వేధింపులు, కుట్రలతోనే సాయిబాబా మృతి

మానవ హక్కులపై పరితపించిన నేత: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మానవహక్కుల నేతకు వెల్లువెత్తిన సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ: ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబా మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రొఫెసర్ సాయిబాబా తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు నిలిచారని కొనియాడారు. సాయిబాబాను 8 ఏళ్లకు పైబడి మోదీ ప్రభుత్వం జైల్లో నిర్బంధించి...ఆయనకు ప్రభుత్వం నరకాన్ని చూపించిందన్నారు. జైల్లోనే ప్రొఫెసర్ సాయిబాబా ఆరోగ్యం క్షీణించిందని... చివరికి ఆయనకి పెరోలు గాని, బెయిల్ గాని రాకుండా మోదీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందని మండిపడ్డారు. జైల్లో కూడా ఆయన మానవ హక్కుల పరిరక్షణకై పరితపించారని తెలిపారు. కుల ప్రాతిపదికన జైల్లో ఖైదీలకు విధులు కేటాయిస్తున్నారన్న విషయాన్ని మొట్టమొదటిగా తెలిపిన వ్యక్తి సాయిబాబానేనన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు కూడా కుల ప్రాతిపదికన ఖైదీలకు విధులు కేటాయించడాన్ని అంటరానితనంగా పరిగణిస్తూ తీవ్రంగా స్పందించడం గమనార్హం అన్నారు. సాయిబాబాను 8 ఏళ్ల అనంతరం బొంబే హైకోర్టు నిర్దోషిగా ప్రకటించినా, అప్పటికే ఆయన్ను అనారోగ్యం వెంటాడిందన్నారు. సాయిబాబా 8 ఏళ్లపాటు జైల్లో మగ్గటానికి మోదీ ప్రభుత్వమే కారణం అన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మరణం పట్ల సీపీఐ రాష్ట్ర సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఇప్పటికైనా పౌర హక్కులు, ప్రజాస్వామిక హక్కులపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని రామకృష్ణ అభిప్రాయపడ్డారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సీపీఎం శ్రద్ధాంజలి

ప్రముఖ విద్యావేత్త, పౌర హక్కులనేత ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతిపట్ల సీపీఎం రాష్ట్ర కమిటీ తరుపున సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వ నిర్బంధ ఫలితంగానే సాయిబాబా మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్బన్ నక్సల్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామిక వాదులను, మేధావులను వేధించడం తక్షణం నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ తరుపున డిమాండ్ చేశారు.

చేతివృత్తిదారుల సమాఖ్య సంతాపం

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి చేతి వృత్తి దారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అమానుష నిర్బంధానికి గురై... అనారోగ్యం తో భాధ పడుతున్న సాయిబాబా చేసిన పోరాటం ప్రజా హక్కుల ఉద్యమానికే స్ఫూర్తి నిచ్చిందన్నారు. ఆయన మరణం ప్రజాస్వామ్యం, మానవ హక్కుల, రాజ్యాంగం కోసం పోరాడుతున్న ఉద్యమానికి తీరని లోటు. ఆయన మృతికి చేతి వృత్తి దారుల సమాఖ్య తరుపున సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సాయిబాబాది సహజ మరణం కాదు: ఏఐఎస్ఎఫ్

ప్రశ్నించే గొంతుక ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంతాప సమావేశం ఆదివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలోని దాసరి భవనంలో నిర్వహించారు. సమాఖ్య పూర్వ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ... మావోయిస్టు సంబంధాలు ఉన్నాయన్న నెపంతో దాదాపు 9 ఏళ్లపాటు ఫాసిస్టు పాలక ప్రభుత్వ నిర్బంధంలో ఉన్న ప్రొఫెసర్ సాయిబాబా మృతి...కచ్చితంగా పాలక ప్రభుత్వ హత్యేనని అన్నారు. ఒక భగత్ సింగ్, ఒక అల్లూరిని చంపితే ఆ ఉద్యమం అక్కడితో ఆగదని, నిర్బంధం, ఎంత ఎక్కువ జరిగితే అంతే ఎక్కువ విప్లవం, ప్రశ్నించే గొంతుకలు ఎక్కువ అవుతాయని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి మందగళ్ల సాయికుమార్, అరసం కార్యదర్శి మోతుకూరి అరుణ కుమార్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో జన్మించిన సాయిబాబా... పోలియో అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ఉన్నత విద్యను అభ్యసించి ఢిల్లీలో విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ స్థాయికి వెళ్లి అనేక మందిని మేధావులుగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. ఆయన కృషిని వివరిస్తూ వ్రాసిన కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో టీచర్స్ యూనియన్ నాయకులు వేణుగోపాల్ విద్యార్థి నాయకులు పాయెల్, సాధిక్ బాబు తదితరులు పాల్గొన్నారు. గుంటూరులోని మల్లయ్య లింగం భవనంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయి బాబాకి నివాళులు అర్పించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు మాట్లాడుతూ 90 శాతం వైకల్యంతో వీల్‌చైర్‌కే పరిమితమైన సాయిబాబాను కావాలనే కుట్రపూరితంగా ఏళ్ల తరబడి జైల్లో నిర్బంధించి వేధించారని... ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యనేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, అజయ్, బన్నీ, గణేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ప్రజా నాట్యమండలి నేత, సినీ దర్శకులు ధవళ సత్యం సతీమణి సీతారత్నం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు

సంప్రదాయాలను కాపాడుకోవాలి

సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంప్రదాయాల పవిత్రతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దసరా సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై దేవీ నవరాత్రులు ఎంతో వైభవంగా నిర్వహించామని సీఎం ట్వీట్ చేశారు. భక్తులందరికీ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించే విధంగా ఏర్పాట్లు జరిగాయని తెలిపారు. మన పండుగలు సంస్కృతీసంప్రదాయాల వారసత్వంలో అంతర్భాగంగా ఉన్నాయని చంద్రబాబు గుర్తుచేశారు. భక్తుల సౌకర్యాలను నిరంతరం మెరుగుపరుస్తూనే ఈ సంప్రదాయాల పవిత్రతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. తిరుమల బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రులను వైభవంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసిన తిరుమల తిరుపతి దేవస్థానానికి అభినందనలు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో గతంలో 16 లక్షల మందికి అన్నప్రసాదం అందించగా, ఈ ఏడాది 26 లక్షల మందికి అందించారని వివరించారు.

సాయిబాబా మృతికి బీజేపీనే కారణం: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతికి బీజేపీ ప్రభుత్వమే కారణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అన్నారు. మీడియాతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇది సహజ మారణంగా అనుకోవడానకి వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో వామపక్ష మేధావులను, లౌకిక శక్తులను, తమను విమర్శించే వారందరినీ పనికట్టుకొని వేధింపులకు గురిచేస్తోందన్నారు. మృతుడి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు.

ధరలు అదుపుచేయకుంటే పోరాటమే...: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ చార్జీలు అదుపు చేయకపోతే పోరాటాలకు సన్నద్ధమవుతామని జంగాల అజయ్ కుమార్ స్పష్టం చేశారు. తక్షణమే నిత్యావసర ధరలు నియంత్రణలోని తీసుకురావాలని, కూటమినేతలు మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు జరపాలని డిమాండ్ చేశారు.

కవి దిగ్గజం జాషువాకు ప్రత్యర్థుల ప్రశంసలు

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: సమాజంలో అణగారిన వర్గాల స్థితిగతుల్ని గబ్బిలం కావ్యం ద్వారా సమాజానికి తెలియజేసిన కవి దిగ్గజం గుర్రం జాషువా అని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కొనియాడారు. మిత్రా రైల్వే యూనిట్, మిత్రా సేవా ట్రస్ట్, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కళాప్రపూర్ణ గుర్రం జాషువా 129వ జయంతి కార్యక్రమం స్థానిక ఠాగూర్ గ్రంథాలయ సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ పాలపర్తి జయకర్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జల్లి విల్సన్ మాట్లాడుతూ... ఆనాటి సమాజంలో అనేక అవమానాలు ఎదుర్కొన్న జాషువా తన రచనల ద్వారా ప్రత్యర్థుల నుంచి కూడా ప్రశంసలు పొందారని చెప్పారు. జాషువా శాసన మండలి సభ్యులుగా సేవలు అందించారని ఆయన చూపిన మార్గంలోనే తాను కూడా ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహించానని చెప్పారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప మాట్లాడుతూ వివక్షతను దునుమాడిన మహాకవి జాషువా అన్నారు. సమసమాజ నిర్మాణానికి జాషువా రచనలు దోహదం చేస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు యువ రచయిత అనిల్ డానీ, ఆర్ఎంఎస్ యూనియన్ నాయకులు కొమ్ముగూరి శామ్యూల్, నీట్ 2023 ర్యాంకర్ కొడాలి సంపత్ రిద్విక్‌లకు జాషువా పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌టీఎస్ విశ్రాంత అధికారి అప్పికట్ల భరత్‌భూషణ్, రచయిత చొరగుడి జాన్సన్, విశ్రాంత డీఎఫ్ఓ పీజే బెనర్జీ, ఆదాయ పన్ను శాఖ అధికారి కొండూరి సురేష్‌బాబు ప్రసంగించారు. నిర్వాహకులు జి.డేవిడ్, పి.రాజగోపాల్, ఆర్‌బీ రాజేంద్రప్రసాద్, కుంపటి ప్రసాద్, కొక్కిలిగడ్డ బాబూరావు, అనపర్తి గుప్తా తదితరులు పాల్గొన్నారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అలయ్ బలయ్‌కు రాను: నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా మృతి చెందడానికి కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అని సీపీఐ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. పదేళ్లు ఆయనను అక్రమంగా నిర్బంధించి వేధించి సర్కార్ చావుదాకా తీసుకెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 90 శాతం దివ్యాంగుడని కూడా చూడలేదని, చివరికి నిర్దోషిగా కోర్టు నిర్ధారించిందన్నారు. సాయిబాబా మరణానికి నిరసిస్తూ హైదరాబాద్‌లో జరిగే అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరు కానని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు తెలిపారు.

ప్రజా ఉద్యమానికి తీరని లోటు

కర్నాకుల వీరాంజనేయులు

విశాలాంధ్ర-జగ్గంపేట: ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం ప్రజా ఉద్యమానికి తీరని లోటని, ఆయనది ప్రభుత్వ హత్యని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు వ్యాఖ్యానించారు. తూర్పు గోదావరి జిల్లా, జగ్గంపేట మండలం, రామవరం శివార్లలోని రంగపల్లి నగరంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాయిబాబా సంతాప సభ ఆదివారం జరిగింది. చిత్రపటానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించారు. దేశంలో పీడితుల పక్షాన గొంతెత్తే మేధావులను చిత్రహింసలకు గురి చేయడం పరిపాటిగా మారిందని కర్నాకుల వీరాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. పీడితులకు విముక్తి కోసం పోరాడిన యోధుడు సాయిబాబా అని కొనియాడారు. ఆయన తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారన్నారు. అక్రమ కేసులో పదేళ్లు జైల్లో ఉండే వేధింపులకు గురయ్యారని, తల్లి చనిపోతే బెయిల్ ఇవ్వలేదని, క్లిష్ట పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని నిర్దోషిగా బయటకు వచ్చారని, అనతి కాలంలో మృత్యు ఒడికి చేరుకున్నారని కర్నాకుల వీరాంజనేయులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు కొండేపూడి మంగయ్య, దొమ్మేటి అర్జున్, పాపయమ్మ జగన్నాథం, సత్తిబాబు, భద్రాసి వీరబాబు, దేగల రామారావు పాల్గొన్నారు.

ఎర్రజెండానే దేశానికి దిక్సూచి

అచ్యుతరామయ్య వర్ధంతి సభలో సీపీఐ రాష్ట్ర నేత ఈశ్వరయ్య

విశాలాంధ్ర-మోపిదేవి: రాబోయే రోజుల్లో ఎర్రజెండానే దేశానికి దిక్సూచి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఆదర్శ కమ్యూ నిస్టు నేత, మోపిదేవి మాజీ సర్పంచ్ కంతమనేని అచ్యుతరామయ్య 13వ వర్ధంతిని మోపిదేవిలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈశ్వరయ్య మాట్లాడుతూ కమ్యూనిజానికి మరణం లేదన్నారు. ప్రజల కోసం ప్రాణాలర్పించిన పార్టీలు దేశంలో ఏమైనా ఉన్నాయంటే అది ఒక కమ్యూనిస్టు పార్టీ నాయకులేనని గుర్తు చేశారు. 17 సంవత్సరాలు ఏకగ్రీవ సర్పంచిగా పరిపాలన సాగించిన అచ్యుత రామయ్య కమ్యూనిస్టుల చేతిలో పరిపాలన ఉంటే ఏ విధంగా ఉంటుందో చేసి చూపించారన్నారు.చంద్ర రాజేశ్వరరావు ప్రారంభించిన భూ పోరాటంలో పేద ప్రజలకు భూములు పంచే ప్రక్రియలో అచ్యుతరామయ్య అగ్రభాగాన నిలిచారని కొనియాడారు. పవన్ కల్యాణ్ సనాతన ధర్మం పేరుతో మత రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని ధ్వజమెత్తారు. తొలుత ప్రధాన సెంటర్లో ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుత్తికొండ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాఘవేంద్రరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి టీ తాతయ్య, సర్పంచ్ నందిగం మేరీ రాణి, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్. పిచ్చియ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబు, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మల్లుపెద్ది రత్నకుమారి, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, మోపిదేవి మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, అచ్యుతరామయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంతం నేని కుటుంబరావు మాట్లాడారు. సీపీఐ నేత రావి ప్రభు ప్రసాద్, పెనుమత్స రాజారత్నం, మల్లుపెద్ది బోసు, కొలుసు లక్ష్మయ్య, బండి రామకృష్ణ, కర్లపూడి ఆదిశేషు పాల్గొన్నారు.

నిష్కళంక నాయకుడు ఐదుకల్లు: జగదీశ్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: నిష్కళంకిత నాయకుడు ఐదుకల్లు సదా శివన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ కొనియాడారు. నీతి నిజాయతీకి, ప్రజాప్రయో జనాల నిబద్ధతకు మారుపేరని శ్లాఘించారు. కమ్యూనిస్టు యోధుడు ఐదుకల్లు సదాశివన్ 36వ వర్ధంతి సభ అనంతపురం రూరల్ మండల సీపీఐ సహాయ కార్యదర్శి నరేశ్ అధ్యక్షతన సమతాగ్రామ్‌లో నిర్వహించారు. నాయకులు నీలం రాజశేఖరరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, వీకే ఆదినారాయణరెడ్డితో కలిసి జిల్లాలో జరిగిన కమ్యూనిస్టు ఉద్యమాలలో సదాశివన్ చురుకుగా పాల్గొనే వారని జగదీశ్ గుర్తుచేశారు. కళ్యాణదుర్గం, కదిరి తదితర ప్రాంతాలలో భూస్వామ్య పోరాటాలు, పెత్తందారి వ్యతిరేక పోరాటాలు సాగించారన్నారు. ఎమ్మెల్సీగా సాదాసీదాగా జీవించి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని శ్లాఘించారు. సదాశివన్ ఆశయాలు కొనసాగించే బాధ్యత నేటి కమ్యూనిస్టులపై ఉందని జగదీశ్ అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఐదుకల్లు రవీంద్రనాథ్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి, సి.మల్లికార్జున, కార్యదర్శి వర్గ సభ్యుడు జె.రాజారెడ్డి, కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, లింగమయ్య, మల్లికార్జున, పద్మావతి, శ్రీశైలం రాజేశ్‌గౌడ్, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి మేకల రమేష్, నగర సహాయ కార్యదర్శి అల్లీపీరా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, గిరిజన సమాఖ్య నాయకులు రామాంజనేయులు, ఏఐవైఎఫ్ నాయకులు ధనుంజయ, ఓబులేసు, నల్లప్ప, రెడ్డప్ప, మహేంద్ర, బలరాముడు, కుల్లాయప్ప, సీపీఐ నగర నాయకులు చాంద్ బాషా, ప్రసాద్, ఫక్రుద్దీన్, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

చరిత్రలో విజయనగరానికి సమున్నత స్థానం

'విజయనగర' ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయనగరం: విద్యల నగరంగా వినుతికెక్కిన విజయనగరానికి చరిత్రలో సమున్నత స్థానం ఉందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. విజయనగరం ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అయోధ్యామైదానంలో ఏర్పాటు చేసిన ఉత్సవ ప్రారంభ కార్యక్రమానికి సభాపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యా, సాంస్కృతిక సేవలకు సకల ఆస్తులను దారపోసిన విజయనగరం మహారాజుల త్యాగనిరతిని కొనియాడారు. ఈ నేలలో నడయాడిన మహానుభావులు చేసిన సేవలను స్ఫురణకు తెచ్చుకొని నివాళులర్పించారు. మన ప్రాంత వైభవాన్ని, ఘనచరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. విజయనగరం పైడిమాంబ అత్యంత శక్తివంతమైన తల్లి అని, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అని పేర్కొన్నారు. రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడిమాంబ దయ రాష్ట్రంపై ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, విజయనగరం ఉత్సవాల్లో భాగస్వాములు కావడం సంతోషదాయకమని పేర్కొన్నారు. విజయనగరం గౌరవాన్ని, కీర్తిని నిలబెట్టడానికి ఈ ఉత్సవాలు దోహదం చేస్తాయని అన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ 24వ సారి నిర్వహిస్తున్న ఈ విజయనగరం ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశామన్నారు. 12 వేదికలపై వివిధ రకాల సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశామని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ ఉత్సవాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కన్నుల పండువగా ఉత్సవ ర్యాలీ

విజయనగరం ఉత్సవాల ప్రారంభర్యాలీ కన్నుల పండువగా జరిగింది. విజయనగరం పట్టణానికి పండుగ శోభను తెచ్చింది. పైడితల్లి ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ అయోధ్యామైదానం వరకు సాగింది. కోలాటాలు, తప్పెటగుళ్లు, బిందెల నృత్యం, కర్రసాము, కత్తి సాము, విచిత్ర వేషాలు, వివిధ జానపద కళారూపాలు, ఒంటెలు, గుర్రాలు, దేశ నాయకులు, కవులు, కళాకారులు, సాహితీ వేత్తలు, విద్యార్థులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులతో సుమారు 55 బృందాలతో వేలాదిమంది హాజరయ్యారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి ర్యాలీకి ఇంఛార్జిగా వ్యవహరించారు. మార్కెఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్, జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాయిబాబా మృతికి కేంద్రానిదే బాధ్యత

విశాఖ పౌర ప్రజాసంఘాల వేదిక

విశాలాంధ్ర-విశాఖ: బీజేపీ ప్రభుత్వ ఫాసిస్టు చర్యల వల్లే మాజీ ప్రొఫెసర్ సాయిబాబా మరణించారని, ఆయన పోరాట స్ఫూర్తితో అన్ని శక్తులూ ఐక్యమై బీజేపీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. పౌర ప్రజాసంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ అధ్యక్షతన ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సాయిబాబా సంతాపసభ జరిగింది. ఆయన మరణవార్త తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రొఫె సర్‌గా విద్యార్థులకు పాఠాలను బోధిస్తూనే దేశంలో నూతన సమాజం కోసం అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. నిర్దోషిగా విడుదలైన కేసులో సుదీర్ఘ జైలు జీవితం అతడి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిందని అన్నారు. గొప్ప విప్లవ ప్రజా మేధావి మరణంతో ప్రజలు నిజమైన స్నేహితుడిని, పోరాట యోధుడిని కోల్పోయారని పేర్కొన్నారు. సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. విశాఖ మార్క్సిస్టు అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం . వెంకటేశ్వర్లు, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టీ శ్రీరామ్ మూర్తి, విరసం ఐక్యవేదిక అధ్యక్షుడు బూసి వెంకట్రావు, పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటలక్ష్మి, ఏయూ రిటైర్డ్ ఉద్యోగి ఏడుకొండలు, న్యాయవాది కేఎస్ చలం, అరసం నాయకులు ఎం. పైడిరాజు, భారత నాస్తిక సమాజం ప్రతినిధులు జీడీ సారయ్య, రామ్ ప్రభు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాగభూషణరావు, ఏఐటీయూసీ నేత వామనమూర్తి, వజ్రం, వీ నల్లయ్య ఎస్.ఆదినారాయణ పాల్గొన్నారు.

అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు

విశాలాంధ్ర-తాడేపల్లి: అవయవదానం నలుగురి జీవితాల్లో వెలుగులు నింపింది. వివరాల్లోకి వెళితే... బాపట్ల జిల్లా నిజాంపట్నంకు చెందిన చెన్ను శ్రీనివాసరావు (48) బైక్‌పై ప్రయాణిస్తూ ఉండగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తలకు బలమైన దెబ్బ తగలటంతో స్థానికులు... కుటుంబ సభ్యులు అంబులెన్సులో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. శ్రీనివాసరావు ఆరోగ్యం విషమించడంతో క్రేనియోటమీ శస్త్ర చికిత్స చేశారు. అయినప్పటికీ మార్పు కనిపించలేదు. వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా పరిగణిం చారు. శ్రీనివాసరావు భార్య విజయలక్ష్మి, కుమారులు సురేష్, సుబ్రహ్మణ్యం అంగీకారం మేరకు ఆంధ్రప్రదేశ్ జీవస్థాన్ చైర్మన్ డాక్టర్ కె.రాంబాబు, క్లస్టర్ హెడ్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి ఆధ్వర్యంలో అవయవదానం జరిగింది. కాలేయం, రెండు కిడ్నీలను మణిపాల్ హాస్పిటల్‌లోని అవసరమైన వారికి ట్రాన్స్ ప్లాంటేషన్ చేశారు. కళ్లు ఎల్వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్‌కి తరలించారు.

ప్రశాంతంగా తొమ్మిదో రోజు టెట్ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(ఏపీ టెట్)-2024లో భాగంగా తొమ్మిదవ రోజు అనగా ఆదివారం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు విభాగంలో ఉదయం జనరల్ అభ్యర్థులకు, మధ్యాహ్నం మైనర్ మీడియా అభ్యర్థులకు ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఈ పరీక్షలలో మొత్తం 19576 మందికి గాను 17272 మంది అభ్యర్థులు అనగా 88.23 శాతం మంది హాజరయ్యారు. ఉదయం 44 సెంటర్లలో జరిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల అర్హత పరీక్షకు 12637 మందికి గాను 11165 మంది అనగా 88.35 శాతం మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం 40 సెంటర్లలో సెకండరీ గ్రేడ్ మైనర్ మీడియా అభ్యర్థుల ఉపాధ్యాయ అర్హత పరీక్షలకు 6939 మందికి గాను 6107 మంది అనగా 88.01 శాతం మంది హాజరయ్యారు. అభ్యర్థులు వీలైనంత ముందుగా తమ హాల్ టికెట్స్ ను డౌన్లోడ్ చేసుకుని అభ్యర్థుల సూచనలు క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని, పరీక్షా సమయానికి ఒకటిన్నర గంటలముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఏపీ టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఏవైనా సందేహాలు వున్నట్లైతే డిపార్ట్మెంటల్ అధికారిని సంప్రదించాలని సూచించారు.

సాహితి

మాండలికపు సొబగులతో

పరిమళించే కవిత్వం

ఒక ప్రాంతపు అస్తిత్వాన్నీ, అక్కడి భౌగోళిక స్థితిగతుల్నీ, అక్కడి సంస్కృతి వైభవాన్నీ ప్రతిబింబించేది మాండలికం. అక్కడి జనజీవితాల జవసత్వాలనూ, హృదయస్పందనలనూ అది భూతద్దంలా మనకు చూపిస్తుంది. శతాబ్దాల పల్లె ఊసుల్నీ, ఎంకి, నాయుడుబావ వంటి ఎన్నో జంటల కొండంత ఆశల్నీవినిపిస్తుంది. వెన్నెల లాంటి పచ్చదనాల కళకళల్నీ, బాల్యపు కలల్నీ మనముందు ఆరబోస్తుంది. అందుకే ఏ సాహిత్యప్రక్రియ అయినా మాండలికపు సొబగుల్ని సంతరించుకుంటే జనజీవితం దానికి హారతులు పట్టి అక్కున చేర్చుకుంటుంది. ఎన్నెన్నో పార్శ్వాలలో మనిషి హృదయస్పందనల్ని లోకానికి వినిపించే కవిత్వమూ ఇప్పుడు 'స్థానికత' అనే పార్శ్వంలోనూ మనిషి భావోద్వేగాలనూ, మనుషుల అనుబంధాలనూ ప్రతిఫలింపజేయాలని తపిస్తుంది. అతని బతుకుపయనంలోని జీవిత మాధుర్యాలనూ, వేదనాతరంగాలనూ వెలికితీయడానికి కవిత్వం తానే మాండలికమైపోతూవుంది. మనిషికి కర్తవ్యాన్ని గుర్తుచేయడానికి అతడి జీవితమూలాలను ప్రతిబింబింపజేస్తూ మానవమనుగడకు అది సరికొత్త భాష్యం చెబుతూనేవుంది. అందుకే మాండలికం ఇప్పుడు కవిత్వానికి ప్రియనేస్తమైపోయింది. అది తన అక్షరాలకు పల్లెనుడికారాలను తొడుక్కొని అందమైన అనుభవాలను రంగరించుకుంటోంది. మనిషి హృదయభాషకు సహజత్వపు వన్నెల్ని దిద్దుతూవుంది.

'వోనాకాలం వొత్తేసాలు/వొల్లు కుందేలు పిల్లలా/ గెంతులేత్తాది.....
సూరీడ్ని సొక్కాజేబులో ఏసి/మూసేత్తున్నట్టు
సెనంలో మబ్బులు/లోకాన్ని మూసేత్తాయి
యెండలు పేనాలు తీత్రే/వోనలు పేనాలిత్తాయి/అందుకేనొరే
యెమడలెములోలు/వోనలు సల్లని తల్లులు....
వోనలో ఎలిగే బల్బులు/సిన్న సేమంతి పూరేకుల్లాంటి/
సిరుసెమటతే మెరుత్తా
సల్లని కిరనాలవోన కురుపిత్తాయ్/సిన్నబుడ్డిసూరిదేవుళ్లనాగ
సల్లని గాలితాకిడికి/సుకంగా కరిగిపోద్ది మబ్బు/గొప్పోలు
అలా పేదల గుండెల్ని
కరిగిత్రే/సోకమంతా ఔద్దరే/వొకటే సేమంతిపువ్వు...
జెర్రి పాకినట్టు ఆకాశంమీదె సూడు/ఎలా పాకుద్దో మెరుపు...
యెంతకాలానికెంతకాలానికంటూ/ఆకాశంలో మబ్బులు
ముద్దులాడ్తావుంటే
ఆ ముద్దులందం/ యీ మెరుపుముక్కలంట....
తెల్లార్లు సూరునుండి/ సడుకసడుకుమని/
సనుగులడ్తావుంటే/ నిద్దరేటడద్ది
సెవికాడ వొకటే/ ముసిలోల్ల సనుగుడునాగ/పైకెగర్ని
వోనరోకళ్ల/ దంపుళ్లపోటు....
గోడల్లోంచి వుబికిన నీరుసూత్రే/సేతికందిన కొడుకు/
సచ్చిపోయి/ గోడకి సేరగిలిపోయి నోరు
దిగులుగా/కళ్లముందు నిలుత్తాడు.....
సూరిబాబు తిన్ననైనోడేటి?/ సెయ్యిచ్చుకు నాగితే
పట్టపగలే సరసమేటని మబ్బురాణీ/సయ్యిదిలించుకుందేమొ
సటుక్కున
ఆకాశం మీద ఐదురంగుల గాజుముక్క రాలింది
సెందురుడి సుట్టు/సిన్నిగుడి సుట్టీ/ సెక్రాలజుట్టు/ నోకానికిచ్చి
ఎయ్యరూపాల/ ఎలిగిపోనాది వొయ్యారి మబ్బుల వోనపిల్ల'
('వోనాకాలం' ఖండిక నుంచి)

అంటూ వర్షాకాలానికి ఉత్తరాంధ్ర మాండలికపు సొబగుల్ని తొడుగుతాడు డెబ్బయ్యవ దశకంలో తన కవిత్వంలో పల్లెజీవనాదిని వినిపించిన రంధి సోమరాజు. వర్షాకాలం వస్తే చాలుఅప్పటివరకు గ్రీష్మతాపంతో తల్లడిల్లిపోయిన మనిషి పులకించిపోతాడు. వానచినుకులతో సరాగాలాడుకుంటాడు. ఇక్కడ వర్షాకాలానికి విలక్షణ పదచిత్రాలతో మాండలిక సొబగుల్ని అద్దింది కవిత్వం. సూర్యుణ్ణి జేబులో వేసుకొని మూసేసే మబ్బులపట్ల అది మమకారాన్ని వొలకబోసింది. అందుకే ప్రాణాలు తీసే ఎండలు యమపాశాలైతే, బతుకుల్ని సేదదీర్చే వానలు చల్లని తల్లులైపోయాయి. వానలో వెలుగుతూ కాంతివిహీనంగా కనిపించే బల్బులు చేమంతి పూరేకుల్లోని చెమటబిందువులైపోయాయి. చిన్నబుడ్డిదీపాల సూర్యుళ్లైపోయాయి. మెరుపులు ఆకాశంలో పాకే జెర్రిలయ్యాయి. ఇక్కడ పల్లెవాతావరణం కవిత్వవాతావరణంతో మమేకమైపోయింది. చల్లని గాలికి మబ్బులు కరిగిపోయినట్టు చల్లని మనసులతో ఐశ్వర్యవంతులు పేదల గుండెల్ని కరిగించాలని, అప్పుడే లోకమంతా ఒకే చేమంతిపూవు అయిపోతుందని వసుధైక జీవనసౌందర్యాన్ని కవిత్వం ఆశిస్తుంది. వానచినుకుల సవ్వడి ఎప్పుడూ పల్లెల్లో వినిపించే రోకటి దంపుళ్ల పోటు అయిపోయింది. కన్నీళ్లలా గోడల్లోంచి వుబికే వర్షపునీటిని చూస్తే కడతేరిపోయిన చెట్టంత కొడుకు తండ్రికి కనిపించిన బాధామయ జీవనచిత్రమూ ఆవిష్కృతమైంది. సూర్యయవ్వనుడు మబ్బురాణి చెయ్యి తాకితే విదిలించుకునే ఆ చెయ్యినుంచి రాలిపడే గాజుముక్క ఇంద్రధనస్సు అయిపోయింది. మబ్బుల అందాలతో వయ్యారంగా నడచివచ్చే వానపిల్లకి పల్లెజీవనపదచిత్రాలతో నీరాజనాలర్పించింది కవిత్వం.

'పెండతో మెత్తువేసిన గాదెలోకి దిగి/ గిన్నెతోటి
అడుగువడ్లను ఎత్తేటందుకు
ముక్కులనిండా, నెత్తినిండా/దుమ్ముపోసుకున్న ఆ పోరడేడి!
నెత్తికి తువ్వాలపేగు కట్టుకొని/జప్పజప్ప మునుం ఎల్లి
ముసలి అవ్వకు ఎదురు మునుం గోసె/నల్లకొడిసె వన్నె ఆ
పోరగాడు నాగ్గావాలి
కిందగ్గోసిన కల్లం మడి/ పదనవాసనలను పీల్చుకుంటూ
గెంతులేసినవాడు ఎంతకూ కానరాడేమి!
ఇరికికొమ్మను నరుకుంటూ/ గొడ్డలిచిత్ప కాలుకొస్తే
గాయాన్ని దాసుకున్న/ ఆ మెరిగెకళ్ల అమాయకుణ్ణి
అచ్చంగా నాకు దొరకబట్టిస్తారా?
పారలేవకున్న/ సర్రసర్ర కాలువను దెంపి
ఉరికే నీళ్లను మడువగట్టే/మూరెడు మక్కకర్రల
బాగుగాడెక్కడున్నాడు
ఆపరేషన్ చేసే రోజు/ అవ్వకేం గాదు, అవ్వ సచ్చిపోదని
పొద్దంతా ఏడ్చిన/ఆ ఎనివిదేండ్ల పసిబాలుడి జాడేది?
వేళ్లసందున చితికిన/బల్సుకు పండ్ల మెత్తని తీపిపుట్టుక
తెలిసినోడిని
గొడ్లను గాసుకుంట/గట్టుదోనెలో మందాలున్న
వాననీళ్ల మాధుర్యాన్ని నింపుకున్నోడిని
నన్ను నాకు కాస్త ఎవరైనా అప్పజెప్పండి'
('నల్లకొడిసె వన్నెకాడు' ఖండిక నుంచి)

అంటూ పల్లె జ్ఞాపకాలతో దోబూచులాడే తన నోస్టాల్జియాలోని మనిషితనాన్ని మళ్లీ తనను ఆవహించాలని నల్లచెట్టు లాంటి తన వన్నెదనాన్ని కీర్తించుకుంటూతెలంగాణ మాండలికంలో తపిస్తాడు వర్తమాన కవి నాగిళ్ల రమేష్.ఇక్కడి బాల్యజ్ఞాపకాల్ని తట్టిలేపుతూ వాటిని ఎన్నెన్నో పల్లెనుడికారాలతో అనుసంధానిస్తుంది కవిత్వం. తనలో దాగివున్న అసలైన మనిషిని గుర్తించడమే ప్రతిమనిషి బాధ్యతని అది గుర్తుచేస్తుంది. గాదెలోని అడుగు వడ్లను ఎత్తుతూ వంటినిండా దుమ్మపోసుకోవడం, ముసలిఅవ్వతో సమానంగా కొడవలి పట్టి పౌరుషానికి పోవడం, కల్లంతో మమేకమైపోయి గంతులేయడం మధురమైన జ్ఞాపకాలు. ఇవన్నీ మనిషితనానికి మచ్చుతునకలు. ఇరికి కొమ్మను నరికినప్పుడు ఆ గొడ్డలి దెబ్బతో కాలికి అయిన గాయాన్ని సైతం దాచుకున్న పట్టుదల కోసం, పార పనిచేయకున్నా వేగంగా కాల్వను ఎడంచేసి ఉరికే నీళ్లకు మడులు కట్టే ఆత్మవిశ్వాసం కోసం మళ్లీమళ్లీ తపించేలా చేస్తుంది కవిత్వం. అమ్మకు ఆపరేషన్ జరిగినప్పుడు ఆమెకోసం పసిబాలుడిగా రోజంతా ఏడ్చిన భావోద్వేగపు ఆత్మీయతకు మనిషితనాన్ని పులుముతుంది. పోరగాడి వేళ్లసందుల్లో చితికిపోయే బల్సుకు పండ్ల మెత్తని తీపి పుట్టుక తెలుసుకోవడం, గొడ్లను కాసుకుంటూ పశువుల మంద వుండే కుంటలోని వాననీటి మాధుర్యాన్ని నింపుకోవడం పల్లెజీవనసంస్కృతిలో లీనమైపోవడమే. జీవనతాత్వికతను బతుకునిండా నింపుకోవడమే. ఆ తాత్వికతను అక్షరాలుగా ఆవిష్కరిస్తుంది మాండలిక కవిత్వం. పూలజలతారు లాంటి ఆ తాత్వికతను మళ్లీ మళ్లీ ఆస్వాదించాలని తపిస్తుంది మనిషి జీవితం. తనలోంచి తప్పిపోయిన తనను తిరిగి తనకు అప్పగించే అద్భుతక్షణాల కోసం ఎదురుచూస్తుంది. మనిషిలోని మనిషి కోసమే హృదయాల ఆవేదన. నిరంతర కవిత్వసాధన. హృదయాల తడినీ, ఆ ఆనందాల సవ్వడినీ మళ్లీ మళ్లీ అందించడానికి స్వచ్ఛమైన, సుందరమైన పల్లెజీవనసౌందర్యం అందుకు అనుసంధానమౌతుంది.

– డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,
సెల్: 9177732414

రాసిందల్లా కవిత్వమే ...!

మనిషి అంతరంగ ఆవిష్కరణకు
మూగసైగ సూర్యోదయం
సైగకు ధ్వనిరూపం మాట
మాటపుట్టుక మానవ వికాస విప్లవం
ఒక మాటకు అనేక అర్థాలు
మనిషి సృజనాత్మక శక్తి
ఏ భాషైనా పదాల పందిరేకదా!
అక్షరానికి అందమైన రూపం లిపి
ఏజాతి సంస్కృతికైనా అది సంకేతం
ధ్వని లయాత్మక సంగీతం
లిపి కళాత్మక శిల్పం
శిల్ప సంగీతాల సమ్మేళనం
మహత్తర సాహిత్యం
మానవ సంవేదనలకు
రసాత్మక కళ సాహిత్యం
ఇదే అసలు కవిత్వ రహస్యం
"దాని రహస్యం కవికే తెలుసు
కాళిదాసుకు తెలుసు, పెద్దన్నకు తెలుసు
కృష్ణశాస్త్రికి తెలుసు, శ్రీశ్రీకి తెలుసు"
అన్నారు (' నవత-కవిత 'లో') తిలక్
ఈ రహస్యం తెలుసుకోవడం
ఉత్తమ కవిత్వసృష్టికి సింహద్వారం
చదవనితనం కవిత్వ శత్రువు
అంటే అర్థం
శృంగార ప్రబంధ కావ్యాలల్లమనో
మహాప్రస్థానం మళ్ళీ రాయమనో కాదు
కవిత్వమల్లే కిటుకు తెలుసుకోమని
"ప్రజా సాహిత్యమూ" కళాత్మకమే
వేమన పద్యమైనా పల్లె పదాలైనా
లాలిపాటైనా జోలపాటైనా
మనసుపెట్టి విను నోరారా అను
అందం ఆనందం నీ అనుభవంలోకే వస్తుంది
దానినే పట్టుకొమ్మంటున్నారు పెద్దలు
సమస్యలు - పరిష్కారాలు
హక్కులు - ధిక్కారాలు
దిగజారే విలువల్ని నిలబెట్టే సుద్దులు
ఏవైనాచెప్పు
అందంగాచెపితే అందరూ వింటారు
ఓహో! అంటారు
ఎంతోకొంత ఆలోచిస్తారు
' ప్రజాకవి 'కి జేజేలని వారే అంటారు
అన్నమయ్య శృంగార పదాలైనా,
రామదాసు భక్తి గీతాలైనా
గద్దరు విప్లవ గర్జనైనా
వంగపండు తిరుగుబాటులో వయ్యారమైనా
గోరటి వెంకన్న వెటకారమైనా
ఏది కాదు కళాత్మకం?
ఆ వాగ్గేయకారుల పదాలు ఒక్కటైనా
జన జిహ్వాగ్రాన చిందాడుతోంది అందుకే
ఆ కిటుకే తెలుసుకో
శబ్దార్థ పదాల పొందిక తెలీకుండా
రాసిందల్లా కవిత్వమేనంటూ రాశావా
నగుబాటు తప్పదు
వర్తమాన కవులారా! తస్మాత్ జాగ్రత్త!

- కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ

తల లేని కవిత



దేశ దేహంలో
గజదొంగలు పడ్డారని
కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి
అలర్ట ఉత్తర్వులు జారీ అయ్యాయి

సంకేతాలు అందుకుని
రోబో వేగులు భౌ బౌ మొరుగుతున్నాయి

నిద్ర నటిస్తున్న మనిషిని
మేల్కొల్పలేక చేతులెత్తేసి
కుక్కలు చుక్కల దారెంట
తోకూపుతూ పారిపోతున్నాయి

అంతా అదుపులోనే ఉందని
ఉన్నపలంగా ఉన్నతాధికారులు
రాజ్యానికి నివేదిక సమర్పిస్తాడు

పాస్వర్డ్ లేని మంత్రివర్గం
నిష్కామ సున్నా విసర్గలను
అభయస్ఫూర్తితో సమీక్షిస్తుంది

అవసరం లేకుండా అయిపోయి
అవయవాలు ఒకటొ క్కటిగా
నాలుగు చక్రాల పాత సామాన్ల
బండి మీద తరలిపోతుంటాయి

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రపంచంలో
ప్రతివాడు ఒక వినిమయదారుడు
షోరూమ్ లో కొలువుతీరిన
నాణ్యత మన్నిక లేని ఒక వస్తువు

ఉత్పత్తి లేని పునాది
తల పట్టుకున్న మనాది
శ్రమ సౌందర్యం అంటని పంట
దళారులతో అంట కాగుతుంది

ఇక ఎన్నడో ఓకనాడు
తన అవసరం తీరిందని భూమి
విశ్వం లోకి అంతర్ధానం అయిపోతుంది

- జూకంటి జగన్నాథం

గ్రంథ సమీక్ష

మొగలిపూల వాసన ఈ 'మేకల బండ' నవల

ఏ హంగులూ, ఆర్భాటాలులేకుండా, సహజసుందరంగా, జీవితానికి దగ్గరగా ఉంది ఆర్.సి.కృష్ణస్వామి రాజు 'మేకల బండ' నవల. చక్కటి చిత్తూరు జిల్లా యాసను ప్రతిబింబిస్తుంది. పాఠకులను కూర్చున్నచోటు నుండి ప్రక్కకు కదలకుండా చదివించగల గుణం పుష్కలంగా ఉన్న పుస్తకం ఇది.

ఈ నవలలో మన యొక్క గొప్ప సంస్కృతి అడుగడుగునా కనిపిస్తుంది. ఎలాగంటే... నివాసం, వృత్తులు, ఆహారపు అలవాట్లు, వేషధారణ, ఆటలు, విద్య, వైద్యం, కళల గురించి అనేక పాత్రల ద్వారా రచయిత తెలియజేస్తాడు. అలాగే మతం, గ్రామదేవతలు, ఆభరణాలు – అలంకరణ, భాష –యాస , ఆచారవ్యవహారాలు మొదలైన మన సంస్కృతిని తెలియపరిచేవి ఎన్నో ఉన్నాయి ఈ నవలలో.

మూగజీవాలైన మేకలు, పొట్టేళ్ళు, గొర్రెలను మేపడంలో ఉన్న సాధక బాధకాలను హృదయానికి హత్తుకునేలా రాశాడు రచయిత.

పచ్చ కామెర్ల వైద్యానికి ఆకు కోసం కొండలు, గుట్టలు వెదికే నారాయణమ్మ పాత్ర చాలా గొప్పగా తోస్తుంది. రోగుల ఆరోగ్యం కోసం ఆమె ఎన్ని కష్టాలైనా పడటం, ఇబ్బందులకు ఎదురీదడం చూసి మన మనసు చలిస్తుంది.

ఈ తరానికి కొత్తగా అనిపించే అరనెల్లికాయలు, ఉడికించిన వేరుశెనగకాయలు, లేత ఈత గింజలు, టెంకాయ మిఠాయిలు, శెనక్కాయ ఉండలను పాత్రల ద్వారా పరిచయం చేస్తూ చదివే వారి నోట్లో నీళ్ళు తెప్పిస్తారు.

అలాగే ఇడ్లీలు, పులిహోర. గడ్డపెరుగు, చింతపులుసన్నం, మేక కూర, పొట్టేలు కూర, మామిడికాయలు, మునక్కాయలు, తాటిపండ్లు, లాంటి రుచికరమైన ఆహార పదార్థాలను గుర్తు చేస్తాడు.



పుస్తకం పేరు : మేకల బండ
పేజీలు : 118, ధర: 100
ప్రతులకు: రచయిత, 9393662821

నేతిలో నల్ల రాగిపిండి, కరివేపాకు, ఉప్పుకలిపిన చిరుతిండి ఆహార పదార్థం గురించి ఆయన రాసిన విధానం, చదివితే వెంటనే మనం కూడా చేసుకుని తినేయాలనిపిస్తుంది.

కథాగమనంలో కులదేవతలైన అంకాలమ్మ, కనికలమ్మకొండ, ఆరేటమ్మపొంగళ్ళు, వినాయక నిమజ్జనం, సొరకాయల తాత గుడి, కైలాసకోన మొదలైన క్షేత్రవిశేషాలు కూడా చాల ఆసక్తిని కలిగిస్తాయి.

సునిశితమైన వ్యంగ్యం, హాస్యం, చమత్కారం, మనుషుల మనస్తత్వాలు, ఈర్ష్యాద్వేషాలు ఈ నవలలో అక్కడక్కడా పాయసంలో జీడిపప్పుల్లా తగులుతాయి. వాటికి ఉదాహరణగా జాతరలో శ్రీకృష్ణుడు, దుర్యోధనుని వేషాలు, కళలు. చింతపూల రవిక, ప్యాంటు, చొక్కా, పంచె, తువాలు, ఒకరూపాయి బిళ్ళంత బొట్టు, కాటుక, నల్లపూసల దండవంటి వేషధారణ, గళ్ళలాట, మేక–పులి ఆటవంటి ఆటలను చెప్పుకోవచ్చు.,

ఈనవలలో మూగజీవాలైన కుంటిమేక, నల్లగొర్రె, మేకపోతు, పొట్టేలు చుట్టూరా నవల నడుస్తుంది. వాటి యజమానులు సుందరం, పెంచల్రాజు, తిరుపాలు, పడివేలు మొదలైనవి ఇందులో ముఖ్యపాత్రలు. మూగజీవాలు తమ యజమాని తీరు నచ్చలేదని కావాలనే తప్పిపోతాయి. వాటికోసం వాటి యజమానులు నలుగురూ అనేకచోట్లవెదుకుతారు. చాలా ఇబ్బందులు పడతారు.

వారు జీవాలను వెదికే క్రమంలో పాఠకుడు కూడా వాళ్ళతోపాటే అంజేరమ్మ కనుమ, పోలీసుస్టేషను, కైలాసకోన, సొరకాయలస్వామిగుడి, గోవిందపాళెంగుట్టకూడాతిరిగిన అనుభూతి కలుగుతుంది. అలా అనుభూతి చెందేట్లు చేయడం రచయిత ప్రతిభగా చెప్పుకోవచ్చు.

తప్పిపోయిన జీవాలుమేకలబండ దగ్గరకు చేరడం, వాటికి యోగి వరం ఇవ్వడం, వాటి ఆలోచనల్లో కుళ్ళు, కుతంత్రం, స్వార్థం, అసూయ, ద్వేషం, దోపిడి, వివక్షత కనిపించడం, యోగి వాటికి కనువిప్పు కలిగించి తను ఇచ్చిన శక్తులను వెనక్కితీసుకోవడం ఈ నవల లోని కథాంశం.

మనిషిలాగా మూగ జీవాలకు ఆలోచనాశక్తి, మాట్లాడే శక్తి వస్తే అవి కూడా తప్పుదారి పడుతాయని రచయిత అద్భుతంగా తెలియజేశాడు. చివరగా ఆ మూగజీవాలు ఆలోచనల అనర్థాలు, మానవ స్వభావాలు అర్థం చేసుకుంటాయి. అందులో సుఖం లేదని తెలుసుకుంటాయి. పశ్చాత్తాపం చెంది యజమానులను కలవడంతో నవల ముగుస్తుంది. యజమానులు వాటిని చేరుకునే ప్రయత్నంచేయడమనే అంశాలమీద ఈ నవలసాగుతుంది.

ఆడవాళ్ళు రిమోట్ వదలకుండా సీరియళ్ళకోసం టీ.వీకి అతుక్కుపోయి మిగతా విషయాలు పట్టించుకోకపోవడం, మగవాళ్ళుచరవాణి మోజులోపడి మూగజీవాలపై మునుపటిలా శ్రద్ధచూపకపోవడం గురించి రాస్తూ సమాజం ఎటు పోతోందోనని బాధను వ్యక్తం చేస్తాడు.

బతుకుతెరువు కోసం చేసే పోరాటం, నిరుద్యోగ సమస్యమొదలైన సామాజిక సమస్యలను కూడా స్పృశించారు. వాటి సమస్యల పరిష్కార బాధ్యత మనపై ఉంచారు. జీవహింస చేయకూడదనే విషయంకూడా కాస్త సున్నితంగా మూగజీవాల నుంచే చెప్పించారు. సాంకేతిక పరిజ్ఞానం, బ్రీడింగ్ విధానం, ట్రెక్కింగ్, వలసపక్షుల విశేషాలు లాంటి జనరల్ నాలెడ్జి గురించి రచయిత ఈ నవలలో వివరించాడు.

మాతృభాషతో పాటు కొంచెం ఆంగ్లభాష మాట్లాడే జీవాలు కాస్త కొత్తగానూ, సరదాగానూ అనిపిస్తాయి. రచయిత ఈ మేకలబండ తన మొదటినవల అంటున్నారు. కానీ చదువుతున్నప్పుడు నవలలు రాయడంలో ఆరితేరిన దిట్టలా కనిపిస్తారు. వేరుశెనగచెట్టుపెరికినప్పుడు వచ్చే మట్టివాసన, అడవిలో వికసించిన మొగలి పూలవాసన ఈ 'మేకలబండ' నవల.

– డా. పుత్తూరు వాణి
తెలుగు అధ్యాపకురాలు
9441641040

మత్స్యకారులపై సముద్రపు దొంగల దాడి

ఆర్కేనగర్: నాగపట్నానికి చెందిన 18మంది జాలర్లపై శ్రీలంక సముద్రపు దొంగలు దాడి చేసి పలు వస్తువులను దోచుకెళ్లారు. నాగపట్నం జిల్లా సెరుదూర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్.. మరో నలుగురు జాలర్లతో కలిసి 8వ తేదీ పడవలో సముద్రంపైకి చేపలవేటకు వెళ్లారు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి చేపలు పడుతున్న సమయంలో 9 మంది శ్రీలంక దొంగలు వచ్చి దాడి చేసి వలలు, పలు వస్తువులను దోచుకెళ్లారు. గాయపడిన ఐదుగురు రాష్ట్ర జాలర్లు సెరుదూర్ తీరానికి చేరుకున్నారు. అదేవిధంగా మూడు పడవలలో చేపలు పడుతున్న 13మంది మత్స్యకారులను శ్రీలంక దొంగలు కత్తులు చూపి బెదిరించి దాడి చేసి రూ.6 లక్షల విలువైన వలలు, జీపీఎస్ పరికరాలు, సెల్‌ఫోన్లు తదితర వస్తువులను దోచుకెళ్లారు. గాయపడిన జాలర్లు ఓరత్తూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలపై కీళయూర్ తీరగస్తీ దళం దర్యాప్తు జరుపుతోంది.

ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ మండిపాటు

న్యూదిల్లీ: బీజేపీ టెర్రరిస్టుల పార్టీ అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. టెర్రరిస్టులకు అండగా నిలిచేది ప్రతిపక్ష పార్టీనే అంటూ విమర్శలు గుప్పించింది. ట్రిపుల్ తలాక్, హలాలా, హిజాబ్ సంప్రదాయాలకు వత్తాసు పలికిన కాంగ్రెస్ నేడు హిందూ సమాజంపై నిరాధార ఆరోపణలు చేస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేదీ మండిపడ్డారు. ప్రధాని మోదీ ప్రస్తావించిన అర్బన్ నక్సల్స్ ఆలోచనా ధోరణి అంటే ఇదేనని అన్నారు. ఇటీవల మోదీ కాంగ్రెస్‌ను అర్బన్ నక్సల్స్ గ్యాంగ్ అని విమర్శించిన విషయం తెలిసిందే. దీనిపై ఖర్గే స్పందిస్తూ బీజేపీ ఉగ్రవాదుల పార్టీ అని విమర్శించారు. కాగా, ఖర్గే వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కూడా స్పందించారు. ఖర్గే వ్యాఖ్యలు ఆయనకు తన సొంత పార్టీపై ఉన్న అభిప్రాయమని అన్నారు. మరో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ కూడా ఖర్గేను టార్గెట్ చేశారు. ఆయన నోరు జారీ బీజేపీని అలా అనుండొచ్చని, వాస్తవానికి సోనియా గాంధీ.. బాట్లా హౌస్ వద్ద మరణించిన టెర్రరిస్టుల కోసం కన్నీరు కార్చారని ఆరోపించారు. అఫ్జల్ గురు విషయంలో ఉదాసీనంగా ఉన్నదీ, పోటా చట్టాన్ని రీఅప్పీల్ చేసిందీ కాంగ్రెస్సేనని చెప్పారు. మోదీ హయాంలో ఉగ్రకార్యకలాపాలు చాలా వరకూ తగ్గుముఖం పట్టాయని చెప్పారు. బీజేపీ ప్రతినిధి సీఆర్ కేశవన్ మాట్లాడుతూ... ఖర్గే వ్యాఖ్యలు కాంగ్రెస్ పక్షపాత ధోరణి, విషతుల్య ఆలోచనా ధోరణిని బయటపెట్టాయని అన్నారు. బ్రిటీష్ వలసపాలకులు లాగా విభజించి పాలించడమే కాంగ్రెస్ విధానమని విమర్శించారు. 'ఉగ్రవాదాన్ని హిందూ సమాజంతో పోల్చుతూ 2013లో కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యల్ని దేశం మర్చిపోకూడదు. ఏకంగా కేంద్ర మంత్రి సుశీల్ కుమార్ శిండే, హిందూ ఉగ్రవాదం అంటూ అవమానకర వ్యాఖ్యలు చేశారు' అని అన్నారు.

ఇక మీ ఇష్టం... నేనేం చేయలేను

రహస్య భేటీలపై సీఎం హెచ్చరిక

బెంగళూరు: రహస్య సభలు, వివాదాస్పద వ్యాఖ్యలతోపాటు ముఖ్యమంత్రి మార్పు అనే అంశంపై అధిష్టానం ఆగ్రహంగా ఉందని, వారు చర్యలు తీసుకుంటే నేను బాధ్యుడిని కాదని సీఎం సిద్దరామయ్య కేబినెట్ సహచరులను తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది. గురువారం జరిగిన మంత్రివర్గ భేటీలో సీఎం సిద్దరామయ్య ఈ విషయాన్ని ప్రస్తావించినట్టు తెలుస్తోంది. బెంగళూరులో పరమేశ్వర్, మహదేవప్ప, సతీశ్ జార్కిహొళిల భేటీ, మైసూరులో సతీశ్ జార్కిహొళి, పరమేశ్వర్ పలువురు ఎమ్మెల్యేలతో కలయిక వంటి అంశాలపై అధిష్టానం ఇప్పటికే తీవ్రంగా మండిపడిన విషయాన్ని ప్రస్తావించారు. పార్టీలో గందరగోళానికి అవకాశం ఇవ్వరాదన్నారు. రాజకీయ అంశాలు చర్చించలేదని పరమేశ్వర్ ప్రస్తావించారు. అయినా అధిష్టానం సీరియస్‌గా ఉందని, వారు చర్యలు తీసుకుంటే తాను బాధ్యుడిని కాదని సీఎం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. కాగా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించేవారికి నోటీసులు జారీ చేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే...పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు సూచించినట్లు తెలుస్తోంది. ఇటీవల డీకే శివకుమార్ బెంగళూరు సదాశివనగర్‌లో ఖర్గేను భేటీ అయిన విషయం తెలిసిందే. పార్టీలో క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని ఖర్గే సూచించినట్లు తెలుస్తోంది. కాగా ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ సోషల్‌మీడియా ఖాతాలు హ్యాక్ అయ్యాయి. వాటిద్వారానే సిద్దరామయ్యకు వ్యతిరేకంగా ఓ పోస్ట్ వెల్లడైంది. దీంతో బీకే హరిప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధం

- 'ఆర్జీకర్'లో కొనసాగుతున్న జూనియర్ వైద్యుల నిరశన దీక్షలు
- 77మంది సీనియర్ వైద్యుల సంఘీభావం
- డిమాండ్లు నెరవేర్చాలని బెంగాల్ ప్రభుత్వంపై ఒత్తిడి

కోల్‌కతా: ఆర్జీకర్ ఆస్పత్రిలో ట్రైనీ జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన బెంగాల్‌లో అధికార టీఎంసీ నేతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. బాధితురాలి కుటుంబానికి మద్దతుగా ఆర్జీకర్ ఆసుపత్రికి చెందిన అనేకమంది జూనియర్ డాక్టర్లు నిరాహార దీక్ష చేస్తున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమించింది. ఇప్పటికే ఆర్జీ కర్ ఆస్పత్రి సహా వివిధ ప్రభుత్వ ఆస్పత్రులకు చెందిన దాదాపు 200మందికి పైగా సీనియర్ వైద్యులు తమ సంఘీభావం ప్రకటించి మూకుమ్మడిగా రాజీనామాలు చేయగా... తాజాగా మరో 77మంది వైద్యులు అందుకు సిద్ధమయ్యారు. కల్యాణి జేఎన్‌ఎంకు చెందిన 77 మంది సీనియర్ వైద్య బృందం నిరసనకారులకు మద్దతు తెలిపింది. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యులకు సంఘీభావంగా రాజీనామా చేయడానికి తామంతా సిద్ధమేనని వైద్యులు తెలిపారు. అక్టోబర్ 14 వరకు గడువు ఇస్తున్నామని.. ఈ లోగా ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ మేరకు పశ్చిమ బెంగాల్ హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌కు ఇ-మెయిల్ ద్వారా తెలియజేశారు. కోల్ కతా హత్యాచార ఘటన తమను మానసికంగా దెబ్బ తీసిందని.. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యుల ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడంపై వారు మండిపడుతున్నారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, ఘటనకు కారణమైన ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎన్ఎస్ నిగమ్‌ను వెంటనే తొలగించాలని, పని ప్రాంతాల్లో మహిళలకు భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న అనేక మంది వైద్యులు ఇప్పటికే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి రాజీనామా లేఖలను సమర్పించారు.

ఆ 200 మంది రాజీనామాలు చెల్లవు: బెంగాల్ ప్రభుత్వం

ఆర్జీ కర్ వైద్యకళాశాలలో నిరసన చేపడుతున్న జూనియర్ వైద్యులకు మద్దతుగా సీనియర్ వైద్యులు మూకుమ్మడిగా చేసిన రాజీనామాలు చెల్లుబాటు కావని పశ్చిమబెంగాల్ ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజీనామాలు చట్టపరంగా చెల్లుబాటు కావని అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అలాపన్ బందోపాధ్యాయ్ మీడియాకు వెల్లడించారు. సర్వీసు నిబంధనలకు అనుగుణంగా రాజీనామా చేయాల్సి ఉంటుందని, ప్రత్యేక ఫార్మాట్‌లో ఉన్నతాధికారులకు పంపాల్సి ఉంటుందని చెప్పారు.

" ఇటీవల సీనియర్ వైద్యుల రాజీనామాపై గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నట్లు కొన్ని లేఖలు వచ్చాయి. వాటిపై రాజీనామా చేసిన వారి హోదాగానీ, ఇతర వివరాలు కానీ లేవు. వాటి ఆధారంగా రాజీనామా చేస్తున్నట్లు పరిగణించలేం. రాజీనామా అనేది ఉద్యోగికి, యజమానికి మధ్య సర్వీసు నిబంధనల ప్రకారం జరగాలి. లేదంటే చట్టప్రకారం అది చెల్లుబాటు కాదు. అందువల్ల ఈ రాజీనామాలను పరిగణనలోకి తీసుకోలేం" అని బందోపాధ్యాయ్ తెలిపారు. మరోవైపు ఆర్జీ కర్ వైద్య కళాశాల విద్యార్థిని హత్యాచారానికి నిరసనగా నిరాహార దీక్ష చేపడుతున్న జూనియర్ వైద్యుల సంఖ్య 10కి చేరింది. ఇప్పటి వరకు 8 మంది దీక్ష చేపడుతుండగా.. శనివారం మరో ఇద్దరు వచ్చి చేరారు.

జవాన్లతో కలిసి రాజ్‌నాథ్ సింగ్ ఆయుధపూజ

డార్జిలింగ్: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డార్జిలింగ్‌లోని శుక్నా కంటోన్మెంట్‌లో శనివారం భారత జవాన్లతో కలిసి విజయదశమి వేడుకల్లో పాల్గొన్నారు. ఆయుధ పూజ చేసి వీరజవాన్లకు తిలకం దిద్దారు. జవాన్లకు, వారి కుటుంబాలకు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో ఒకడిగా విజయదశమి వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. 'శస్త్రపూజను ఎంతో శ్రద్ధాభక్తులతో జరుపుకొనే కొద్ది దేశాల్లో భారతదేశం ఒకటి. మన ఆరాధ్యదైవాలను పూజించేటప్పుడు శస్త్రపూజ చేయడం మన సంప్రదాయం. దేశంలోని ప్రొఫెషనల్స్ అంతా ఏడాదికి ఒకసారి తమ పనిముట్లను పూజించడం మనం చూస్తుంటాం. దీపావళి, వసంత పంచమి రోజున విద్యార్థులు ఇంక్, పుస్తకాలకు పూజలు చేస్తారు. సంగీత విద్వాంసులు తమ వాయిద్యాలకు పూజ చేస్తారు. దేశంలోని అనేక కుటుంబాలు వ్యవసాయ సంబంధిత కుటుంబాలు ఉన్నాయి. శస్త్రపూజ అంటే కేవలం వాటిని పూజించడమే కాదు, పని పట్ల మనకున్న గౌరవాన్ని చాటుకోవడం కూడా అవుతుంది' అని రాజ్‌నాథ్ అన్నారు. ఏళ్ల తరబడి జవాన్లు ఆయుధపూజ చేయడం సంప్రదాయంగా వస్తోందని, ఈరోజు విజయానికి సంకేతమని, శ్రీరాముడు రావణుని సంహరించిన రోజని అన్నారు. ఇది కేవల విజయం కాదు, మానవతావాదాన్ని దక్కిన విజయమని అన్నారు. శ్రీరాముని లక్షణాలు మన జవాన్లలో తాను చూశానని, ఈ రోజు వరకూ మన సంస్కృతిని అవమానించినప్పుడు మాత్రమే భారతదేశం ఇతర దేశాలపై దాడి జరిపిందని, విద్వేషం కారణంగా ఎన్నడూ దాడులు చేయలేదని అన్నారు. దేశ ప్రయోజనాలకు ఎలాంటి విఘాతం కలిగినా ఎలాంటి పెద్ద చర్య తీసుకోవడానికైనా వెనుకాడేది లేదని, దేశ ప్రజలకు తాను భరోసా ఇస్తున్నానని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి పరిస్థితులు ఉన్నప్పటికీ జవాన్లు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకైనా సర్వసన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్..

తృటిలో తప్పిన ప్రమాదం

రూర్కీ(ఉత్తరాఖండ్): రైలు ప్రమాదాలే లక్ష్యంగా ఇటీవల వరుసగా వెలుగు చూస్తున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఉత్తరాఖండ్‌లోని రూర్కీ సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఎల్‌పీజీ సిలిండర్ కనిపించడం కలకలం రేపింది. వెంటనే గూడ్స్ రైలు లోకో పైలట్ అప్రమత్తమవడంతో.. ప్రమాదం త్రుటిలో తప్పింది.

ఉత్తర రైల్వే సీపీఆర్‌వో అధికారి పేర్కొన్న వివరాల ప్రకారం.. లలాండౌర్-ధంధేరా స్టేషన్ల మధ్య ఆదివారం ఉదయం 6:35 గంటలకు ఈ ఘటన వెలుగు చూసింది. గూడ్స్ రైలు స్టేషన్ సమీపానికి వస్తుండగా.. లోకో పైలట్ పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్ ఉండటాన్ని గమనించారు. వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. సిలిండర్‌ను ఘటనా స్థలానికి దూరంగా తీసుకెళ్లి పరిశీలించగా.. అది ఖాళీది అని తేలింది. స్థానిక పోలీసులు, జీఆర్పీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవల ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. యూపీలోని లలిత్‌పూర్‌లో రైల్వేట్రాక్‌పై ఇనుప రాడ్లను ఉంచి రైలు పట్టాలు తప్పేందుకు ప్రయత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కాన్పూర్‌లోని రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్‌ను గుర్తించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్‌లో ఆర్మీ సిబ్బంది ప్రయాణిస్తున్న రైలును పేల్చేందుకు ప్రయత్నాలు జరిగాయి. రైల్వే ట్రాక్‌పై ఉంచిన పేలుడు పదార్థాలను అధికారులు గుర్తించారు. గుజరాత్‌లోని బొటాడ్‌లో పట్టాలపై ఇనుప ముక్కను ఉంచిన ఇద్దరు వ్యక్తులను అధికారులు అరెస్టు చేశారు. వరుస ఘటనల నేపథ్యంలో అనేక సందర్భాల్లో లోకో పైలట్లు అప్రమత్తంగా ఉండడంతో ప్రమాదాలు తప్పాయి. దీంతో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు రైల్వే ట్రాకులపై నిఘా పెంచారు.

16న ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారని తెలిసింది. ఈ మేరకు సీఎం అభ్యర్థి ఒమర్ అబ్దుల్లా విలేకర్లతో మాట్లాడుతూ... గత ఆరేళ్లుగా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అమల్లో ఉందని గుర్తు చేశారు. దీనికి ముగింపు పలికేందుకు కేబినెట్ నోట్ తయారు చేయాల్సి ఉందన్నారు. ఈ నోట్‌ను రాష్ట్రపతి భవన్‌తోపాటు కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సైతం పంపిస్తామన్నారు. అందుకు సంబంధించిన ప్రక్రియా సోమవారం పూర్తవుతుందని తెలిపారు. అనంతరం సీఎంగా బాధ్యతలు చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలున్న జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి ఇటీవల మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి. ఫలితాలు ఈ నెల ఎనిమిదో తేదీన వెలువడ్డాయి. నేషనల్ కాన్ఫరెన్స్ కూటమికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారు. నేషనల్ కాన్ఫరెన్స్ 42 స్థానాలు, కాంగ్రెస్ పార్టీ ఆరు స్థానాలు గెలుచుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుకు తమను అనుమతించాలంటూ జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను ఒమర్ అబ్దుల్లా కోరారు. అలాగే తమతోపాటు సీపీఐ(ఎం), ఆప్, స్వతంత్ర్య అభ్యర్థులు సైతం తమ వెంట ఉన్నారని ఎల్జీకి ఒమర్ అబ్దుల్లా వివరించారు. 2009 నుంచి 2014 వరకు ఒమర్ అబ్దుల్లా జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రిగా పని చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు. ఇక 2019లో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసింది. దీంతో దాదాపు దశాబ్దం అనంతరం ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జరిగిన తొలి ఎన్నికలు ఇవి. దాంతో ఆ రాష్ట్ర ఓటరు నేషనల్ కాన్ఫరెన్స్ కూటమికి ఓటు వేసి మద్దతుగా నిలిచారు.

బాలీవుడ్‌తో సంబంధాలే సిద్ధిఖీ హత్యకు కారణమా?

ముంబై: ఎన్సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ(67)ని తామే హత్య చేసినట్టు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. దీంతో సిద్ధిఖి హత్యకు బాలీవుడ్‌తో ఆయనకు సంబంధాలు ఉండటం ఓ కారణం కావచ్చా అనే కొత్త కోణం కూడా వెలుగు చూసింది. సిద్ధిఖి రాజకీయాల్లో ప్రముఖుడే కాకుండా బాలీవుడ్ సెలబ్రెటీస్‌తోనూ మంచి స్నేహసంబంధాలు సాగించేవారు. విలాసవంతమైన లైఫ్ స్టయిల్ తో పాటు లగ్జరీ కార్లను సేకరించడం లోనూ ఆయన ముందుండే వారు. రూ.76 కోట్ల విలువైన ఆస్తులు ఆయనకు ఉన్నాయి. కాగా, సిద్ధికి ఏటా ఇచ్చే ఇఫ్తార్ విందుకు బాలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖలంతా పోటీపడి హాజరయ్యేవారు. సల్మాన్ ఖాన్, షారూక్ ఖాన్, సంజయ్ దత్ వంటి ప్రముఖులు ఆత్మీయ అతిథ్యంలో పాల్గొనేవారు. సల్మాన్ ఖాన్, షారూక్ ఖాన్ మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడల్లా సంధాన కర్తగా వ్యవహరించి వారిని తిరిగి కలుపుతుండేవారు. ఇక సంపాదనపరంగా చూస్తే 2014 ఎన్నికల అఫిడవిట్‌లో తనకు రూ.76 కోట్ల విలువైన ఆస్తులున్నట్టు ప్రకటించారు. 2004లో రూ.12 కోట్లు ఉండగా, 2009లో అది రూ.25 కోట్లకు చేరింది. రూ.23.58 కోట్ల రుణాలు ఉన్నట్టు కూడా ఆయన డిక్లేర్ చేశారు. లగ్జరీ కార్లంటే బాగా మోజుపడేవారు. 2014లో రూ.31 లక్షలు విలువ చేసే మెర్సిడెస్ బెంచ్ ఎ180 స్పోర్ట్ ఉండేది. ఆయన భార్యకు రూ.86.54 లక్షలు విలువ చేసే మెర్సిడెస్ బెంచ్ ఎస్ క్లాస్ 350 ఎల్ ఉండేది. సిద్ధిఖికి సొంతంగా బీఎండబ్ల్యూ సిరీస్, రోల్స్ రాయస్ ఫాంటమ్ కూడా ఉందంటారు. 2014లో సిద్ధిఖి, ఆయన భార్యకు రూ.6 కోట్ల విలువైన జ్యూయెలరీ ఉంది. బాంద్రాలో రూ.నాలుగు కోట్ల విలువైన కమర్షియల్ ప్రాపర్టీ ఉంది. అదనంగా మరో కోటి 91 లక్షల ఆస్తులున్నాయి. బాంద్రాలో భార్యాభర్తలకు రూ.3 కోట్ల 15 లక్షలు విలువచేసే రెసిడెన్షియర్ ప్రాపర్టీలు ఉన్నాయి. బాంద్రా, కలిన, శాంతాక్రుజ్ ఈస్ట్‌లో ఆయన భార్య పేరిట పలు ఆస్తులు కూడా ఉన్నాయి. బీహార్‌లో పుట్టిన సిద్ధికి చిన్నప్పుడే ముంబై వచ్చేశారు. సెయింటేన్స్ హైస్కూలులో పాఠశాల విద్య, ఎంఎంకే కాలేజీలో బీకామ్ డిగ్రీ చేశారు. అయితే కాలేజీ విద్యను ఆయన పూర్తి చేయలేదంటారు. 12వ తరగతి పాస్ అయినట్టు ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారు.

బాబా సిద్ధిఖీని చంపింది మేమే...

లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటన

ముంబై : ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీని హత్య చేసింది తామేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. సిద్ధిఖీ శనివారం సాయంత్రం ముంబైలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా ముగ్గురు దుండగులు ఆయనపై కాల్పులకు పాల్పడ్డారు. వెంటనే ఆయనను లీలావతి ఆస్పత్రికి తరలించగా... చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన కర్నైల్ సింగ్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ధరమ్ రాజ్ కశ్యప్ అనే ఇద్దరు నిందితులు తాము లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందినవారమని పేర్కొన్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. మూడో నిందితుడైన యూపీకి చెందిన శివకుమార్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. 'ఇది ట్రైలర్ మాత్రమే... ముందుంది అసలు సినిమా' అంటూ నాడు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ పోస్ట్ పెట్టారు. తాజా ఘటన నేపథ్యంలో సల్మాన్ ఇంటి వద్ద భద్రతను పెంచారు.

బాబా సిద్ధిఖీ దారుణ హత్య

ముగ్గురి అరెస్టు... మరొకరి కోసం గాలింపు

కొనసాగుతున్న విచారణ

ముంబై : నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత బాబా సిద్ధిఖీ దారుణ హత్యకు గురయ్యారు. సిద్ధిఖీని శనివారం ముంబైలో ముగ్గురు దుండగులు కాల్చి చంపారు. బాంద్రా ఈస్ట్‌లోని తన కుమారుడు జీషన్ సిద్ధిఖీ కార్యాలయం ముందు టపాసులు కాలుస్తున్న సమయంలో గుర్తు తెలియని ముగ్గురు దుండగులు ఆయనపై కాల్పులు జరిపి పారిపోయారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన ముంబైలోని లీలావతి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సిద్ధిఖీ కన్నుమూశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సిద్ధిఖీ శరీరంపై అనేక తుపాకీ గాయాలు ఉన్నాయి. వాటిలో ఒకటి ఛాతీపై ఉంది. అయితే కాల్పులకు పాల్పడిన వారిలో తొలుత ఇద్దరిని, ఆ తర్వాత మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హర్యానాకు చెందిన గుర్మైల్ బల్జీత్ సింగ్ (23), ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ధరమ్‌రాజ్ కశ్యప్ (19), మరొకరు యూపీకే చెందిన శివకుమార్‌గా గుర్తించారు. హ్యాండ్లర్‌గా భావిస్తున్న నాల్గవ వ్యక్తి పరారీలో ఉన్నాడు. సిద్ధిఖీని హత్య చేసేందుకు నెల రోజుల నుంచి బాంద్రాలోని ఆయన కుమారుడి ఇంటి వద్ద దుండగులు రెక్కీ నిర్వహించినట్లు ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసుల విచారణలో తేలింది. అనుమానితులు నెలల తరబడి సిద్ధికీ నివాసం, కార్యాలయంపై నిఘా పెట్టారు. ఈ హత్య చేసేందుకు నిందితులకు ఒక్కొక్కరికి రూ.50 వేలు అడ్వాన్స్‌గా, ఆయుధాలు హత్యకు కొన్ని రోజుల ముందు వారికి అందించబడినట్లు పోలీసులు వెల్లడించారు.

సిద్ధిఖీపై ఆరు రౌండ్ల కాల్పులు

సిద్ధిఖీపై మొత్తం ఆరు రౌండ్ల కాల్పులు జరిగాయని, అందులో మూడు బుల్లెట్‌లు బాబా సిద్ధిఖీ శరీరంలోకి దూసుకెళ్లాయని ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆదివారం తెలిపారు. ముంబైలోని క్రైమ్ బ్రాంచ్ యూనిట్-3 కార్యాలయంలో డీసీపీ విశాల్ ఠాకూర్ సమక్షంలో ఇద్దరి నిందితులను విచారణ చేస్తున్నారు. ఈ ఘటనతో ముంబై పోలీసులు కూడా సల్మాన్ ఖాన్ నివాసం చుట్టూ భద్రతను పెంచారు. మరో నెల రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సిద్ధిఖీ హత్య జరగడం మహారాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆదివారం ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ 'ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ముంబై పోలీసు ప్రధానాధికారి నాకు చెప్పారు. ఒకరు ఉత్తర ప్రదేశ్, మరొకరు హర్యానాకు చెందినవారు. మూడవ దుండగుడు పరారీలో ఉన్నాడు. కానీ పోలీసులు అతన్ని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు' అని తెలిపారు.

రెండు మూడు రోజుల్లో తేలుతుంది : అజిత్ పవార్

సిద్ధిఖీ హత్య తమ పార్టీకి తీరని లోటు అని ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) అధ్యక్షుడు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అన్నారు. హత్య వెనుక ఎవరి హస్తం ఉందో తేల్చేందుకు మొత్తం ఐదు బృందాలను ఏర్పాటు చేసి వివిధ రాష్ట్రాలకు పంపించామని, రెండు మూడు రోజుల్లో కుట్రదారులు ఎవరో బయటికి వస్తుందని తెలిపారు. గత రాత్రి హత్యకు గురైన బాబా సిద్ధిఖీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముంబైలోని కూపర్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి దగ్గరకు వెళ్లిన అజిత్ పవార్.. సిద్ధిఖీ కుమారుడు జీషన్ సిద్ధిఖీని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సిద్ధిఖీ హత్యను తాను ఇంకా నమ్మలేకపోతున్నానని అన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి, హోం మంత్రితో పాటు తాను కూడా హత్య కేసును పర్యవేక్షిస్తున్నానని అజిత్ పవార్ చెప్పారు. కాగా, బాబా సిద్ధిఖీ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయిన తర్వాత బాంద్రాలోని నివాసానికి ఆయన మృతదేహాన్ని తరలించారు. ఆదివారం రాత్రి 8.30 గంటలకు ముంబై లైన్స్‌లోని బడా ఖబ్రస్థాన్‌లో సిద్ధిఖీ అంత్యక్రియలు నిర్వహించారు.

రాజకీయ జీవితం ఇలా...

బాబా సిద్ధిఖీ ముంబైలోని బాంద్రా వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి చెందిన ఆశిష్ షెలార్ చేతిలో ఆయన ఓడిపోయారు. అయితే 2000 ప్రారంభంలో కాంగ్రెస్-అవిభక్త ఎన్సీపీ ప్రభుత్వంలో ఆహారం, పౌర సరఫరాలు, కార్మిక, ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ), వినియోగదారుల రక్షణ శాఖల సహాయ మంత్రిగా పని చేశారు. కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐలో చేరినప్పుడు ఆయన రాజకీయ జీవితం యుక్తవయసులో ప్రారంభమైంది. కొంతకాలం తర్వాత ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. 1999లో ఎమ్మెల్యే అయ్యారు. 2004, 2009లో బాంద్రా వెస్ట్ స్థానం నుంచి తిరిగి ఎన్నికయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సిద్ధిఖీ కాంగ్రెస్‌తో ఐదు దశాబ్దాల అనుబంధాన్ని ముగించుకుని అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరారు. ప్రజా సేవ చేయడంతో పాటు గ్రాండ్‌గా పార్టీలు నిర్వహిస్తారనే పేరు సిద్ధిఖీకి ఉంది. 2013లో ఆయన నిర్వహించిన ఇఫ్తార్ విందులో బాలీవుడ్ స్టార్స్ షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్ పాల్గొన్నారు. అప్పట్లో వారి మధ్య విబేధాలు ఉండేవట. ఈ పార్టీలోనే సిద్ధిఖీ ఆ ఇద్దరు సినీ నటులను దగ్గరకు చేర్చి గొడవలను పరిష్కరించినట్లు చెబుతుంటారు.

కశ్మీర్ పండితులు వెనక్కి రావాలి

ఫరూక్ అబ్దుల్లా



శ్రీనగర్: లోయలో ఉగ్రవాదంతో ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టిన కశ్మీర్ పండితులు తిరిగి సొంత గూటికి చేరుకునేందుకు ఇదే తగిన తరుణమని ఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. పండిట్లకు ఎన్సీ శత్రువు కాదని, ప్రభుత్వం అందర్నీ కలుపుకొని ముందుకు వెళ్తుందని చెప్పారు. 'ఇక్కడి నుంచి వెళ్లిపోయిన తమ్ముళ్లు, చెల్లెళ్లు అందరూ తిరిగి ఇంటికి వస్తారని ఆశిస్తున్నాను. అందుకు ఇప్పుడు సమయం వచ్చింది. వాళ్లు సొంతగూటికి తిరిగిరావాలి. మేము కేవలం కశ్మీర్ పండితుల గురించే ఆలోచించడం లేదు, జమ్మూ ప్రజలందరి గురించి ఆలోచిస్తున్నాం. వారిని మేము బాగా చూసుకోవాల్సి ఉంటుంది. వాళ్లు కూడా నేషనల్ ఫ్రంట్ తమ శత్రువు కాదని విశ్వసించాలి. మనమంతా భారతీయులం, అందర్నీ కలుపుకొని ముందుకు వెళ్లాలని మేము కోరుకుంటున్నాం' అని ఫరూక్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. కశ్మీర్ పండితులు 90వ దశకంలో ఉగ్రవాదం ఉధృతంగా ఉన్న దశలో కశ్మీర్ లోయను విడిచిపెట్టి పారిపోయారు. ఇళ్లు, ఆస్తులు విడిచిపెట్టి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి అక్కడ స్థిరపడ్డారు. కాగా, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఫరూక్ మరోసారి డిమాండ్ చేశారు. అది జరిగితేనే రాష్ట్రం తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించగలుగుతుందని అన్నారు. ఇక్కడ అతిపెద్ద సమస్య నిరుద్యోగమని, జమ్మూకశ్మీర్‌ను కలిపి ఉంచడానికే తాము ప్రాధాన్యతనిస్తామని చెప్పారు.

రావణదహనానికి విల్లుపట్టిన ముర్ము, మోదీ

న్యూదిల్లీ: దేశవ్యాప్తంగా విజయదశమి వేడుకలు అంబరాన్నంటుతున్న వేళ... దేశరాజధాని దిల్లీలోని మాదవ్ దాస్ పార్క్‌లో ధార్మిక్ లీలా కమిటీ నిర్వహించిన వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా నిర్వహించిన 'రావణదహన్' కార్యక్రమంలో వీరిరువురూ విల్లు చేతపట్టి శరసంధానం చేశారు. దీనికి ముందు రాష్ట్రపతి, ప్రధాన మంత్రి వేదిక వద్దకు చేరుకోగానే రామలక్ష్మణ వేషధారులకు తిలకం దిద్దారు. నవరాత్రుల చివరిరోజున విజయదశమి (దసరా)ని ఏటా ఎంతో వైభవంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంటారు. ఇందుకు సంబంధించిన పురాణగాథలు కూడా చాలానే ఉన్నాయి. దుష్టుడైన రావణాసురుని రాముడు యుద్ధంలో ఓడించిన రోజును విజయదశమిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దసరా పండుగతోనే దీపావళి సన్నాహాలు కూడా మొదలవుతాయి. విజయదశమి వెళ్లిన 20 రోజులకు దీపావళి వేడకను అత్యంత వైభవంగా దేశప్రజలు జరుపుకుంటారు.

సాయిబాబా ఇకలేరు

ప్రశ్నించే గొంతు మూగబోయింది..!!
పూచేవి పూచి రాలేవి రాలుతూ ఉన్నె
పూలు జైలు మల్లె పూలు
కాచేవి కాచి కొమ్మపైనే గిడసబారుతున్నె
పళ్ళు ! జైలు జామి పళ్ళు
ఇది మనుషులున్న మరుభూమి
మనస్సుల రుద్రభూమి.
"స్వేచ్ఛకిది జీవ సమాధి...
స్వాతంత్ర్యానికిది గోరీ
స్వేదం మీద మదం సవారీ
లాఠీ అణునిత్యం పహారా తిరుగుతుందిక్కడ
ఖాకీ అడ్డులేని జులుం సాగిస్తూందిక్కడ
ఖాకీ మానాచ్ఛాదనం ఎక్కడ?
జైలే రాజ్యాధికారానికి సంరక్షణ కుడ్యం
రాజ్య నిరంకుశత్వం జాడ్యం
ఎన్ని మొగ్గల్ని విప్పారకుండానే తొక్కేస్తున్నారు.
ఎదక్కుండానే మొక్కల్ని కత్తిరిస్తున్నారు
అమాయకత్వం, దౌర్భాగ్యం, అజ్ఞానం
శిక్షలనుభవిస్తున్నె న్యాయానికి
ధర్మానికి జాగానై
పాదులు పూచే పువ్వులు, మొక్కలు
కాచే ఫలాలు
అధికారుల శ్రీమతులకు శ్రీ నైవేద్యాలు'
'!!కెవిఆర్...!!
ప్రొఫెసర్ సాయిబాబాకు
లాల్ సలామ్..
కన్నీటి నివాళి..!!

- ఎ.రజా హుస్సేన్

ఆశయాలు సజీవమే!

బాల్యంలోనే కాటేసిన
వైకల్యాన్నెక్కిరించిన ఓ మేరునగధీరుడా!
పట్టుదలకు చిరునామాగా నిలిచిన
ఓ ఆచార్యా!
మేధావులంటే భయపడేవారిని చూడలేక
ఎగిరే ఎర్రజెండాయై
దిగంతాలకి వెళ్లిపోయారా?

అంక్షల కంచెను ధిక్కరించి
ప్రజలను చైతన్యపరచి
కారాగారవాసాన్ని ఆహ్వానించిన మీరు
గగనతలంలో జ్వలించేందుకు
గగనవీధికేగారా?

రెండుకాళ్ళూ లేకపోయినా
జనులదారి సుగమం చేయుటకు
కంటకాలపై ముందుకు సాగిన
ఓ గురువర్యా!
మీరు భౌతికంగా లేకపోయినా
మీ ఆశయాలు సజీవమే!

- వేమూరి శ్రీనివాస్,
ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం వారి గిడుగు పురస్కార గ్రహీత, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సాహితీ పురస్కార గ్రహీత

'సొంతగా కుర్చీ కూడా ఎక్కలేని వ్యక్తి... తన మేధస్సుతో, మాటతో 56 అంగుళాల ఛాతీనే భయపెట్టి...మనువాద రాజ్యహింసకు గురై అమరుడైన ఆచార్య రెడ్ సెల్యూట్'

- డాక్టర్ క్షేత్రపాల్ రెడ్డి

'రాజ్య క్రూరత్వానికి మరో ప్రాణి బలి. ప్రొఫెసర్ జీఎస్ సాయిబాబా మృతి'

- ఆకుల అమరయ్య

జోహార్ సాయిబాబా

అన్యాయాన్ని ఛేదించిన అభ్యుదయ చక్రం

చక్రాల కుర్చీలో కూర్చొని తన భావాలతో, ఆలోచనలతో, అభ్యుదయ సిద్ధాంతాలతో యావత్ దేశాన్ని అధ్యయనం చేసిన అభ్యుదయవాది ప్రొఫెసర్ సాయిబాబా. తన విద్యా విజ్ఞానంతో అన్యాయాన్ని ఛేదించి పేద ప్రజల హృదయాల్లో నిలిచిన వ్యక్తి. కవిగా, ఆలోచనాపరుడుగా, విప్లవకారుడిగా జైలు గోడల మధ్య కూడా తన కలలను వదులుకోక నిత్య నూతన చైతన్య వ్యక్తిత్వంతో వెలుగొందిన మహనీయుడు. మావోయిస్టులతో సంబంధం అంటూ ముద్ర వేసి జైలు గోడల మధ్య తన స్వేచ్ఛ పూరిత ఆలోచనలకు సంకెళ్లు వేసి బంధించినప్పటికీ తనలోని తాత్విక చింతన, కవిత్వం, పోరాట పటిమ ఆయనను మరింత బలపరుచుకునేలా చేసింది. ప్రజల కోసం పోరాడాలనే తపన మరింతగా పెరిగింది. సత్యం, ధర్మం, న్యాయం కోసం ప్రొఫెసర్ సాయిబాబా పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి. తన జీవితంతో చరిత్రను సృష్టించాడు.

ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా భారతీయ పండితుడు, రచయిత, మానవ హక్కుల కార్యకర్త. ఆయన తన ఆలోచనలకు, వ్యాఖ్యలకు, మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో ఎల్లప్పుడూ వార్తల్లో నిలిచేవారు. సాయిబాబా తన విద్యా జీవితాన్ని విజయవంతంగా పూర్తి చేసి, ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఆనంద్ కళాశాలలో ఇంగ్లీష్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. విద్యార్థుల్లో ప్రజాస్వామ్యం, సమాజ సేవ, సామాజిక న్యాయం గురించి అవగాహన పెంచడానికి కృషి చేశారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలను ఎదుర్కొన్నారు. పోలీసుల ప్రకారం, ఆయన పనిచేసిన సంస్థలు మావోయిస్టు అనుబంధ సంస్థలు. ఈ ఆరోపణల ఆధారంగా 2014లో మహారాష్ట్ర పోలీసులు సాయిబాబాను అరెస్టు చేశారు. అనంతరం ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు ఆయనను మానవ హక్కుల కార్యకర్తగా భావిస్తే, మరికొందరు ఆయనను మావోయిస్టు సానుభూతిపరుడుగా భావించారు. ఈ వివాదం విశ్వవిద్యాలయాలలో, ఇతర విద్యా సంస్థలలో విస్తృత చర్చకు దారితీసింది. సాయిబాబాపై విచారణ జరిపిన కోర్టు, ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే, ఆయన తనపై ఉన్న ఆరోపణలను తిప్పికొట్టి, తాను నిర్దోషి అని వాదించారు. తన విడుదల కోసం చాలా కాలం పాటు న్యాయపోరాటం చేశారు. 2024లో ముంబై హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించింది. దీంతో ఆయనను జైలు నుంచి విడుదల చేశారు. విడుదల తర్వాత సాయిబాబా తనపై అన్యాయం జరిగిందని ఆరోపించారు. సాయిబాబా ఆదివాసీల హక్కులు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం కోసం పోరాడటమే కాకుండా అనేక పుస్తకాలు, వ్యాసాలు రాశారు. సాయిబాబా గురించి ప్రజలలో విభిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ ఆయన జీవితం మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, విద్య వంటి అంశాలపై జరిగిన చర్చలకు ఉదాహరణ. సమాజంలోని విభిన్న వర్గాల మధ్య జరిగే సంఘర్షణలను ప్రతిబింబిస్తుంది. శారీరకంగా అంగవైకల్యం అయినప్పటికీ అపారమైన ధైర్యంతో సమాజంలో ఉన్న వైకల్యాలను తొలగించి ఆదివాసీ పేద ప్రజల హక్కుల కోసమై పోరాటం చేసి, బహుళ జాతి సంస్థల దోపిడీ నుంచి విముక్తి పరచటానికి ప్రజలను, విద్యార్థు లను, చైతన్యవంతం చేసిన నాయకుడు. ప్రొఫెసర్ సాయిబాబా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన మరణం అణగారిన ప్రజలకు, ఆదివాసీలకు తీరని లోటు. ఒక చైతన్య పతాకం నింగికేగిసింది. ఒక విప్లవ నినాదం మూగబోయింది. ప్రొఫెసర్ సాయిబాబా జీవితం వివాదాలు, విజయాలు, విషాదాలతో నిండి ఉంది. ఆయన మానవ హక్కుల కోసం చేసిన పోరాటాన్ని చరిత్ర ఎప్పటికీ మరువలేదు. లాల్ సలాం... లాల్ సలాం ప్రొఫెసర్ సాయిబాబా... లాల్ సలాం.

- కవి సాహితీ విశ్లేషకులు పూసపాటి వేదాద్రి 9912197694

ఐసీయూలోనూ అభ్యుదయ భావనలే...

- ఇజ్రాయిల్ ఆర్మీలో, ఇండియన్ ఆర్మీలో వుండే క్రూరత్వాల గురించి.
- సాయి విదేశాలకు వెళ్ళినప్పుడు బ్లాక్‌పాంథర్స్‌తో జరిగిన పరిచయాలు, జ్ఞాపకాలు. ఇప్పటికీ ఇంకా మూడు వందల మంది బ్లాక్‌పాంథర్స్‌తో జైల్లో మగ్గుతున్న విషయాల గురించి.
- పాలస్తీనా పోరాటం గురించి నిరంతరం మాట్లాడుతున్న పాకిస్థాన్-బ్రిటిష్ రాజకీయ కార్యకర్త, రచయిత, జర్నలిస్టు తారిఖ్ అలీ గురించి.
- యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ లైబ్రరీలో కెన్యా రచయిత గూగీ వా థియోంగో రాసిన పుస్తకం కోసం వెతుకుతున్నాడు వరవరరావు. అప్పటికే ఆ పుస్తకాన్నే చదువుతూ కూర్చున్నాడు సాయిబాబా. అక్కడే వారిద్దరి మొదటి పరిచయం.
- రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని ఎన్నో సంవత్సరాలు అనేక చోట్ల వీణ వాయిస్తూ నిరసన కార్యక్రమాలు జరిపిన ఒక వినూత్న నిరసనకారుడి గురించి.
- "రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి" అనే బోర్డును మెడలో వేసుకొని నగరమంతా తిరిగిన మట్టి మనిషి పాండు రంగారావు గురించి.
- "ఇంగ్లీష్ సాహిత్యంపై మా అమ్మాయి మంజీరాకు ఎన్నో ఉత్తరాలు రాసాను. అవన్నీ ఒక పుస్తకంగా వేస్తే బాగుంటుంది." అన్నారు జి.ఎన్.సాయిబాబా
- "నా ఇంగ్లీష్ కవితలన్నీ కలిపి ఒక పుస్తకం వేసారు. అవన్నీ తెలుగులోకి అనువాదం చేయించి పాండు గారి మట్టి ముద్రణలు ప్రచురణ ద్వారా లేదా ఛాయా ప్రచురణ ద్వారా తీసుకువస్తే బాగుంటుంది. అది ప్రయత్నం చేయండి." అని సాయిబాబా చెప్పారు.
- "హాస్పిటల్ మీద రాసిన పది పేజీల కవిత ం చందమామను హిందూ దేశంగా ప్రకటించాలన్న హిందుత్వ వాదుల గురించి రాసిన కవిత. ఈ రెండు కవితలు నా ఇంగ్లీష్ పోయెట్రీ బుక్ లో ప్రింట్ చేయడం మర్చిపోయారు. ఈసారి ప్రింట్ వేసేటప్పుడు వాటిని మర్చిపోకండి. ఇంకా అచ్చు కాని కవితలు చాలానే ఉంటాయి. వాటిని వెతకాలి." అని సూచించారు.
- "ఇష్టమైన వారితో మాట్లాడేటప్పుడు మాతృ భాషలో మాట్లాడితేనే సహజత్వం ఉంటుంది. ఆ సహజత్వాన్ని కిల్ చేయడం కోసమే ములాఖాత్ లో వసంతకూ నాకూ మధ్య భాషల నిభందనలు పెట్టారు." అని సాయిబాబా తెలిపారు.
- "అసలు ప్రపంచంలో ఎక్కడా ఇలా జరిగి ఉండదేమో. అమ్మ చనిపోతే చివరి చూపును కూడా చూసుకోనివ్వకుండా అంత్యక్రియల సమయంలో నన్ను అమ్మ దగ్గర హాజరు పరచలేదు." అని చెప్పారు.
- "నాకు చాలా ఇష్టమైన కవి చెరబండరాజు." అని సాయిబాబా వెల్లడించారు.

- నాతో జరిపిన సంభాషణలోంచి కొన్ని అంశాలు.. దొంతం చరణ్

'ఇండియా ఒక విఫల రాజ్యం' అని నిరూపించిన కమ్యూనిస్టు

ఇన్నాళ్లూ భారత ఉప ఖండంలో విఫల రాజ్యం (ఫెయిల్డ్ స్టేట్) అంటే పాకిస్తానే అనుకునేవాళ్లం. పాక్‌కు భారతదేశం ఈ విషయంలో పెద్దన్నని 2024 అక్టోబర్ 12 విజయదశమి రోజున ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణంతో రుజువైంది. 2014లో అరెస్టయ్యే నాటికి పోలియో తప్ప ఏ జబ్బూ లేని గోకరకొండ నాగ సాయిబాబాని 'శాసనం ద్వారా నిర్మితమైన' భారత రాజ్యాంగం ప్రకారం నడుస్తున్నట్టు మనం చెప్పుకునే భారతదేశం... నేడు ప్రాణం లేని మనిషిగా మార్చడానికి పది సంవత్సరాల సమయం తీసుకుంది. అందుకే అది విఫలరాజ్యం. సాయిబాబా కోర్టు తీర్పుతో నిర్దోషిగా రుజువై బయటకు వచ్చాకే కన్నుమూయడం విషాదమే కాదు, విశ్వగురువుగా ముద్రేసుకున్న ఇండియాకు మాయని మచ్చ. సాయిబాబాని శారీరకంగా, మానసికంగా పోలియో ఏమీ చేయలేకపోయింది. కానీ విఫలరాజ్యంగా తేలిన ఇండియా ఆయన 57 ఏళ్లకే చనిపోవడంలో కీలక పాత్ర పోషించింది. రాజ్యహింసను వర్ణించ అలవికాని రీతిలో ప్రతిఘటించి, నిలబడిన ఉక్కు మనిషిగా సాయిబాబా భారత చరిత్రలో నిలిచిపోతారు. అలాగే ఇండియాలో జైళ్లు ఎలా ఉంటాయో చెప్పిన మొదటి వ్యక్తిగా దేశప్రజలకు గుర్తుండి పోతారు'

- నాంచారయ్య మెరుగుమాల

మానవహక్కుల ఉద్యమానికి తీరని లోటు: సంగమం ఘన నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతి మానవహక్కుల ఉద్యమానికి తీరని లోటు అని ప్రముఖులు అన్నారు. సంగమం అధ్వర్యంలో స్థానిక లెనిన్ సెంటర్‌లోని లెనిన్ పార్కులో ఆదివారం సాయిబాబా సంతాప సభ జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జనసాహితీ సంపాదకుడు దివి కుమార్, సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకుడు మోతుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఫాసిస్టు పాలకుల అణిచివేతకు సాయిబాబా బలయ్యారని ధ్వజమెత్తారు. 'నేను చావును ధిక్కరిస్తున్నాను' అనే పుస్తకం రాశారని, కబీర్ కవితలు, ఫైజ్ అహ్మద్ కవితలను తెలుగులో అనువాదం చేశారని చెప్పారు. తొలుత శ్రద్ధాంజలి ఘటించి... సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిబాబా విప్లవ పంథాన్ని కీర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్ర నాయక్ విప్లవ గీతాలు ఆలపించారు. సంగమం ప్రోగ్రెసీవ్ ఫోరం జాతీయ నాయకుడు బుడ్డిగ జమిందార్, అక్కినేని చంద్రరావు, సంగమం నాయకులు కె.తాజారావు, విరసం రాష్ట్ర నాయకులు అరసవెల్లి కృష్ణ, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప, సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాయికుమార్, ఏఐవైఎఫ్ నాయకులు లంకా గోవిందరాజులు, కేఎన్‌పీఎస్ నాయకులు శ్రీరాములు, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి శాంతిశ్రీ, ఎంబీవీకే నిర్వాహణ కమిటీ సభ్యులు రామరాజు పాల్గొన్నారు.

రాజీలేని పోరాటయోధుడు

'సాయిబాబా నిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం బాధాకరం. దాదాపు దశాబ్దంపాటు జైల్లో గడిపిన ఆయన ఎన్నడూ మనోధైర్యాన్ని కోల్పోలేదు. ఎదురైన సమస్యలు, ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. 90 శాతం అంగవైకల్యంతో బాధపడుతున్న ఆయనకు బెయిల్ కూడా ఇవ్వలేదు. తల్లి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు బెయిల్ నిరాకరించారు. ఆయన రాజకీయ సిద్ధాంతాలతో ఏకీభవించకపోయినప్పటికీ మానవ హక్కుల హరణను ఖండిస్తున్నాం. సాయిబాబా తరపు సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్‌తో చర్చలు జరిపేందుకు వచ్చేవారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా'

- సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి

వామపక్ష మేధావులు, సామాజిక కార్యకర్తలు

హైదరాబాద్: ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా రాజీలేని పోరాట యోధుడు అని వామపక్ష నాయకులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు శ్లాఘించారు. ప్రభుత్వ నిరంకుశత్వాన్ని, అక్రమ నిర్బంధాన్ని ధైర్యంగా ఎదుర్కొని విజేతగా నిలిచారని కొనియాడారు.

ప్రభుత్వ చర్యలను నిరసించాలి

'ఆచార్య సాయిబాబాది ప్రభుత్వ హత్య. అక్షరం రాజ్యాల్ని కూల్చుతుందేమోనని చేయని నేరాలకు సంబంధం లేని అక్రమ కేసులు బనాయించి జైళ్లలో పెట్టి ఆరోగ్యం క్షీణించే వరకు చార్జిషీటులు లేకుండా కాలయాపన చేయడమే స్టాన్ స్వామి, ఆచార్య సాయిబాబా మరణాలకు కారణం. సాయిబాబాకు జోహార్లు అర్పిస్తూనే, ప్రభుత్వ చర్యలను నిరసించాలి. సాయిబాబా అంతిమ యాత్ర సోమవారం ఉదయం 10 గంటలకు మొదలవుతుంది. ఆయనను మనస్ఫూర్తిగా స్మరించుకోవాలని.. మాతో చేరాలని అందరినీ ఆహ్వానిస్తున్నాము. కడ చూపు కోసం హైదరాబాద్, మౌలాలీలోని జవహర్ నగర్‌లో స్ప్రింగ్ హాస్పిటల్ ఎదురుగా శ్రీనివాస హైట్స్‌కు తరలి రండి. ఆయన కోరిక మేరకు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి దానం చేయనున్నాము'.

- సాయిబాబా కుటుంబ సభ్యులు.

ఎప్పటికీ పరి మార్చలేని దీపశిఖ

'నువ్వు నవ్వుతూ ఉంటే రాజ్యానికి ఎంత కష్టమయ్యిందో! దేశ చరిత్రలోనే ముదునాష్టపు కుట్ర కేసు. 10 ఏళ్లు-3650 రోజులు.... ఎముకలను కూడా యాసిడ్‌లో కరగబెట్టే క్రిమినల్ తీరు... వంగిపోయిన ఎముకలను అండా సెల్ జైల్లో యాసిడ్‌లో మరగబెట్టి, పీల్చి పిప్పిచేసి ఒక మెదడు తప్ప అన్ని అవయవాల నిర్వీర్యం చేసి విడుదల చేసిన తీరు స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలో ఎప్పటికీ మర్చిపోలేని ఒక దుష్ట అధ్యాయం. జీవితమంతా సమాజాన్ని చదువుతూనే ఉద్యమాల ఉపాధ్యాయుడిగా నువ్వు నడిచిన దారి... అందరికీ దీపస్తంభం అని అనను కానీ... ఎప్పటికీ పరి మార్చలేని దీపశిఖ అని మాత్రం నీకు నువ్వే రుజువు చేసుకున్నావు. ఈ ప్రపంచంలో చక్రాల బండిలో చక్ర భ్రమణం పొందే జ్ఞాపకాలలో ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ తీరు నీ పేరు చిరస్థాయి కామ్రేడ్. నేను అందరిలా నీ గురించి దుఃఖపడడం లేదు. దుఃఖం అంతర్ముఖం మాత్రమే దుఃఖం లేని సమాజం కోసం సముద్రుడై నడిచే వాళ్లకు... నివాళి కూడా దుఃఖ అంతర్ముఖంలో ముగియాలి కదా!

ఏకకాలంలో మీ ఎడల, స్టాన్ స్వామి ఎడల జైల్లో ఉన్నప్పుడు ఈ ప్రభుత్వం అనుసరించిన కఠిన పాషాణ వైఖరి... వాళ్ల కిరాతకాన్ని శిలాక్షరం చేసింది. మిమ్మల్ని సిలువ వేసిన క్రీస్తు కంటే ఆధునిక కాల చరితార్థుల్ని చేసింది.

కంప్యూటర్లలోకి ఒక మాల్వేర్ ఎక్కించి... రాజ్యం అనుకుంటే.. పాతకాలపు ఎన్‌కౌంటర్లు జరిగిన కాలంలో పక్కనే ఒక ఆలివ్ గ్రీన్ యూనిఫారం ఒక తుపాకీ, సాయుధ పోరాట సాహిత్యం తీరు... ఆధునికత చాటుకోగలదని మీ కేసుల్లోనే కదా! అన్ని దేశాలకు తెలిసేలా జరిగింది.

యూనివర్సిటీలను ప్రభావితం చేసిన మేధావి, అడవులను, జన పదాలను.. సమస్త కళా రంగాలను, అన్నింటికంటే ముఖ్యంగా అనేక మానవ విలువలను ప్రభావితం చేయగలరని చెప్పడానికి మీరు ఈ కాలంలో ఒక లివింగ్ లెజెండ్. ఇంకా చరిత్ర సృష్టించే సమయం చాలా మిగిలి ఉండగానే... పక్కకెముకలు- కండరాలే సరిగా లేని.. అరివీర భయంకర టెర్రరిస్టు శరీరాన్ని అనకొండలా పరపరా విరిచేసిన మానని గాయాలు ఇప్పుడు మృత్యువై కబళించినాయి. తెలంగాణ ఉద్యమ చరిత్ర రాసుకున్నన్ని రోజులు, తొలి అడుగుల వరంగల్ డిక్లరేషన్‌కు మీ తోడ్పాటు గురించి చెప్పకుండా దాటి వేయడం సాధ్యం కాదు. దేశ రాజధానిలో మీరు విద్యార్థులను ప్రభావితం చేసిన తీరు... శాశ్వతంగా ఈ దేశంలోని చాలామంది మేధావులని బుద్ధి జీవులని అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేసింది. నీ మరణం తర్వాత... నీ చరిత్రను వైప్ అవుట్ చేయడానికి వాళ్ల దగ్గర నీ మీద కుట్రకు పనికి వచ్చిన మాల్వేర్ పనిచేయదు కదా! అవును నువ్వు ఎప్పటికీ వెంటాడుతున్న జ్ఞాపకమే. నీ అంతిమయాత్ర వేళ నిఘా నేత్రాలతో రికార్డు చేసే వాళ్లకు తెలియదు... ఒత్తుకున్న కంటిలో తడి తరువాత కూడా మోసులెత్తే మొలకలలాంటి మరణాంతర పురస్కారాలు ఉంటాయని...

నీ జ్ఞాపకాలతో ఎవరిని భయపెడతావో నాకు తెలియదుగానీ.. నాలాంటి వాళ్లను పిరికివాళ్లుగా దిగజారకుండా ధైర్యం మందు నూరిపోస్తావని నమ్మకం ఉన్నది. సాయిబాబా! రాజ్యమెంత కసాయిదో శాశ్వతంగా చాటి చెప్పి కనుమూసిన నీ చావు ఒక చారిత్రక చాటింపే'

- చెరుకు సుధాకర్

'వసంత'కు సాయిబాబా లేఖ

నా దరహాసం వాళ్ళకు అసహనం కలిగించింది.
వారు నాకు మళ్ళీ గొలుసులు వేశారు!!
ఆయన ఆచార్యుడు..స్వేచ్ఛ ఆయన ప్రాణం.
పౌరహక్కులు ఆయన శ్వాస..చక్రాల బండిపై
ఆయన నడక..అయినా విశ్వజనీనం ఆయన
అడుగులు... ఆయన పేరు జీఎన్ సాయిబాబా.

విద్యావేత్త, రచయిత, మానవ హక్కుల కార్యకర్త, ప్రొఫెసర్. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఆనంద్ కళాశాలలో ఇంగ్లీష్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్. మావోయిస్టు కార్యకలాపాలకు సంబంధించి 90శాతం శారీరక వైకల్యంతో ఉన్న సాయిబాబా మెదడే ఎక్కువ ప్రమాదకరమైందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యకుట్రకు, మానవీయ దృక్పథంలేని న్యాయ వ్యవస్థలు కలిసి జీఎన్ సాయిబాబాను బలిగొన్నాయి. ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురంలో పేద రైతు కుటుంబంలో జన్మించారు. తన భార్య తెలిపిన విషయాల ప్రకారం వారి గృహానికి విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ఐదేళ్ల వయసులో పోలియో సోకి రెండు కాళ్లూ పూర్తిగా దెబ్బతిన్నాయి. స్థానికంగా విద్యాభ్యాసం చేసిన తరువాత అమలాపురంలోని కోనసీమ భానోజీ రామర్స్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేశారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్‌లో కూడా విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఆనంద్ కళాశాలలో ఆంగ్ల విభాగంలో అధ్యాపకునిగా చేరాడు. అమలాపురంలో గ్రాడ్యుయేషన్ చేసున్నప్పుడే ఆయన వామపక్ష రాజకీయాల వైపు ఆకర్షితులయ్యారు. దురదృష్టమేమంటే రెక్కల్లేని పక్షిని పంజరంలో బంధించింది రాజ్యం. స్వేచ్ఛావాయువులు పీల్చాలన్న చిన్నికోరిక ఆయన చివరి రోజుల్లో తీరలేదు. సరికదా! కటకటాలవెనక ఆయన జీవితం తెలవారిపోయింది. 2014లో అరెస్ట్ చేసినపుడు ఆయనతో జైలులో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఎడమ చేయి నరాలు దెబ్బతిన్నాయి. దానికి వైద్యం అందించకపోవడంతో ఆ చేయి బాగా పాడయింది. పాంక్రియాస్ దెబ్బతిన్నాయి. ప్రొస్టేట్ సమస్య పెరిగింది. మూత్రాశయంలో రాళున్నాయి. 15 సంవత్సరాలుగా హై బీపీ ఉంది. సూరీడ్ని చీకటిగదిలో బంధిస్తే ఏమవుతుంది.? ఆ గదిలోని చీకటిని తరిమి, వెలుగును నింపేస్తాడు. సూరీడు.. సాయిబాబా.. ఇందుకు మినహాయింపు కాదు. సాయిబాబా కవి కూడా... అందుకే ఆయన అక్షరాలకు అంత పరిమళం.!! మావోయిస్టులతో సంబంధమున్న కేసులో బాంబే హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా తీర్పు ఇవ్వడంతో 2024 మార్చి8న నాగ్‌పూర్ జైలు నుంచి విడుదలయ్యారు. శనివారం రాత్రి 8.36 గంటలకు సాయిబాబా మరణించారు. సాయిబాబా జైలు జీవితంలోని అనుభవాల్ని తన జీవన సహచరి 'వసంత'కు అప్పుడప్పుడు కవిత్వం రూపంలో లేఖలు రాసేవారు. అలాంటి ఓ కవిత ఇది.

"నేను చావును నిరాకరిస్తున్నాను. అత్యంత ప్రియమైన వసంతా.!
నేను చనిపోవడానికి నిరాకరించినపుడు
నా చేతులకు వేసిన సంకెళ్ళు వదులు చేశారు
నేను విశాల మైదానాల్లోకి గడ్డిపూలవైపు చిరునవ్వులు చిందిస్తూ వచ్చాను
అదేంటో కానీ, నాదరహాసం వాళ్ళకు అసహనం కలిగించింది
అప్పుడు వారు నాకు మళ్ళీ గొలుసులు వేశారు
రాజ్యానికి చిరునవ్వుల వెలుగు కంటే..కన్నీటి ..
చీకటంటేనే ఇష్టమేమో? స్వేచ్ఛకంటే కారాగార
బంధనమే రాజ్యానికి ప్రియమేమో?
వాళ్ళు నా చేతికి సంకెళ్ళనైతే వేయగలిగారు. కానీ నా భావాలకు కాదు.

కటాకటాల చీకటి గదిలో కూడా భావ కిరణ ప్రసారం జరుగుతుంది!! చేతుల్ని బంధించొచ్చు...ఆలోచన కాదన్నది కవి భావన.

- ఎ.రజాహుస్సేన్

కేంద్రానిదే బాధ్యత

- సాయిబాబా మరణంపై కూనంనేని
- ప్రొఫెసర్ కుటుంబ సభ్యులకు సీపీఐ నేతల పరామర్శ

విశాలాంధ్ర-హైదరాబాద్: ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, మానవ హక్కుల ఉద్యమ నేత జీఎన్ సాయిబాబా మరణం సమాజానికి తీరని లోటు అని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సాయిబాబా మరణానికి సంతాపాన్ని, ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. కూనంనేని సాంబశివరావు ఆదివారం సాయంత్రం సాయిబాబా నివాసానికి వెళ్లి ఆయన భార్య వసంతతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కూనంనేని వెంట సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలకొండ కాంతయ్య, మారుపాక అనిల్, టీపీఎఫ్ నాయకులు రవిచంద్ర ఉన్నారు. కూనంనేని మాట్లాడుతూ సాయిబాబా స్ఫూర్తి సమాజాన్ని తట్టి లేపుతుందని ఆకాంక్షించారు. సాయిబాబా చాలా మందిని రాజకీయంగా చైతన్యపరిచారని కొనియాడారు. మావోయిస్టులతో సంబంధం ఉన్నదనే కేసులో బాంబే హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించడంతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారని గుర్తుచేశారు. జైలులో ఉన్నప్పుడు సాయిబాబకు మంచినీళ్లు తాగనివ్వలేదని, అన్ని కష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్న ఆయన మరణించడం బాధాకరమని కూనంనేని ఆవేదన వ్యక్తంచేశారు. సాయిబాబా మరణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని అన్నారు. ప్రముఖ కవి వరవరరావు పరిస్థితి కూడా సాయిబాబా మదిరిగా ఉందని, గృహ నిర్బంధం పేరుతో శారీరకంగా, మానసికంగా అణచివేస్తున్నారని పాలకుల తీరును కూనంనేని ఆక్షేపించారు. వామపక్షాలు అంటేనే భయపడేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యకం చేశారు. 2026 నాటికి మావోయిస్టులను తుదముట్టిస్తామని హెచ్చరించడం వెనుక మతలబేమిటని కూనంనేని ప్రశ్నించారు. ఇదే నెపంతో ఇటీవలే 31 మందిని, అంతకు ముందు 26 మందిని ఎన్‌కౌంటర్ చేశారని, ఏడాదిలో 200 మందిని ఎన్‌కౌంటర్ చేశారని తెలిపారు. బీజేపీది రాక్షస పాలన... దుర్మాగుల రాజ్యమని, దీని వల్ల దేశానికి మంచి జరగబోదని కూనంనేని అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.